నేటి పత్రిక ప్రజా వార్త

NETI PATRIKA PRAJA VARTHA

తెలుగు వార పత్రిక

Postal License No.VJ/220/2023-25

TELUGU ONLINE DIGITAL NEWS PORTAL & ONLINE CHANEL

Prajavatha-Online Telugu News

http://www.prajavartha.com

వీక్షించండి .. చదవండి... చెప్పండి...

విజయవాడ | తేదీ : 24-31 జనవరి 2025 | సంపాదకులు : కొండూరి శ్రీనివాసరావు | సంపుటి: 04 | సంచిక : 34 | పేజీలు : 4 | రూ. 5.00

స్వర్ణాంధ్ర స్ఫూర్తి పథంలో గణతంత్ర దినోత్సవ శకటాలు

- 18 శకటాలను నగర ప్రజలు తిలకించేందుకూ ప్రత్యేకంగా వీలుకల్పించిన ప్రభుత్వం

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : 76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా ఆదివారం విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో జరిగిన వేడుకల్లో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న అలంకృత శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్వర్ణాంధ్ర ఏ 2047 పది సూత్రాల ప్రగతి సోపానాల విజన్ డాక్యుమెంట్ స్ఫూర్తిగా తీసుకొని వివిధ శాఖలు రూపొందించిన శకటాలు ఆకట్టుకున్నాయి. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి భవిష్యత్తు దార్శనికతపై ప్రభుత్వ చిత్తశుద్ధి, నిబద్ధతను ప్రతిబింబించేలా రూపొందిన శకటాలను నగర ప్రజలు తిలకించేందుకు వీలుగా వేడుకల అనంతరం ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానం నుంచి బెంజ్ సర్కిల్, రామవరప్పాడు రింగ్, గుణదల, ఏలూరు రోడ్డు, కంట్రోల్ రూమ్, బందర్ రోడ్డు తదితర ప్రాంతాల మీదుగా శకటాల ప్రదర్శన నిర్వహించారు.

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రదర్శించిన 18 శకటాలు:

1. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ మరియు ప్రణాళికా శాఖలు: పేదరికం లేని సమాజమే మన ప్రభుత్వం ఆశయం. 2. గృహ నిర్మాణ శాఖ: 2029 నాటికి అర్హులకు పక్కా ఇళ్లు & ఇంటి నివాస స్థలాలు., 3. పరిశ్రమలు: యాంప్లిఫైయింగ్ ఆంధ్రప్రదేశ్... న్యూ ఇంపెటస్... న్యూ ఎరా., 4. పర్యాటక శాఖ: పర్యాటక వారసత్వం మరియు సంస్కృతి. 5. సమగ్ర శిక్ష, పాఠశాల విద్యా శాఖ: విద్యా వికసిత ఆంధ్ర., 6. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్: స్కిల్లింగ్ ఆంధ్రా., 7. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం: కేన్సర్‌పై విజయం స్క్రీనింగ్ తోనే సాధ్యం., 8. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం: కిశోరి వికాసం బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్., 9. జలవనరుల శాఖ: తెలుగు తల్లికి జల హారతి., 10. అటవీ శాఖ: నగర వనం... ఎకోటూరిజం., 11. రైతు సాధికార సంస్థ: వ్యవసాయ శాఖ... ప్రకృతి వ్యవసాయం., 12. మత్స్య శాఖ: మౌలిక వసతుల కల్పనతో ఆక్వాకల్చర్ లో అధిక ఉత్పత్తులు., 13. ఏపీ సీఆర్డీఏ: .మన అమరావతి.... ప్రజా రాజధాని అమరావతి నిర్మాణం, 14. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి: పల్లె పండగ – పంచాయతీ వారోత్సవాలు. 15. ఇంధన శాఖ: పర్యావరణ సహిత విద్యుత్ వనరుల ఉత్పత్తి లక్ష్యం., 16. ఉద్యానవన శాఖ: డీప్ టెక్నాలజీస్ అనుసంధానంతో ఉద్యానవన ఆంధ్రప్రదేశ్., 17. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్: పర్యావరణ రక్షిత స్వచ్ఛాంధ్రప్రదేశ్.
18. రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ: సాంకేతికతో పాలనలో విప్లవాత్మక అడుగులు.

తొలి మూడు స్థానాల్లో నిలిచిన శకటాలు: 1. నైపుణ్యం–మానవ వనరుల అభివృద్ధి (డిపార్టుమెంట్లు: హెచ్ఆర్డీ/ నైపుణ్యాభివృద్ధిబీ ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమంబీ మహిళా, శిశు సంక్షేమం). 2. నాణ్యమైన ఉత్పత్తులు, బ్రాండింగ్ (డిపార్ట్‌మెంట్: ఉద్యాన) 3. గ్లోబల్ – బెస్ట్ లాజిస్టిక్స్ (డిపార్ట్‌మెంట్లు: సీఆర్డీఏ/పురపాలక, పట్టణాభివృద్ధిబీ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి)

ప్రధాని మోదీకి కూడా మన శకటం నచ్చింది: సీఎం చంద్రబాబు.. దేశ రాజధాని ఢిల్లీలో నేటి రిపబ్లిక్ డే వేడుకల్లో అందమైన ఏటికొప్పాక బొమ్మలతో కూడిన ఏపీ శకటం అందరినీ ఆకట్టుకుందని ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీకి కూడా మన శకటం నచ్చిందని అన్నారు. ఇతర ప్రముఖులు కూడా ఏపీ శకటం పట్ల ఆసక్తి ప్రదర్శించారని తెలిపారు. ఏటికొప్పాక బొమ్మలు కళాకారుల సృజనాత్మకతకు మారుపేరు అని చంద్రబాబు అభివర్ణించారు. ఏపీ శకటం రూపకల్పనలో భాగస్వాములైన ప్రతి ఒక్కరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని పేర్కొన్నారు.

ఏటికొప్పాక బొమ్మలతో ఏపీ శకటం... కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం:
ఢిల్లీలో నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకల్లో ఏటికొప్పాక బొమ్మలతో కూడిన ఏపీ శకటాన్ని ప్రదర్శించడం పట్ల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్య పథ్ లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ పతాకాన్ని ఎగురవేసిన అనంతరం గణతంత్ర దినోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఏపీకి సంబంధించి ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఏటికొప్పాక లక్క బొమ్మలను ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన శకటం ప్రదర్శించడం రాష్ట్రం గర్వించదగిన అంశం అని పేర్కొన్నారు. ఏటికొప్పాక బొమ్మలకు ప్రాచుర్యం కల్పించాలని, కళాకారుల నైపుణ్యం ప్రపంచానికి చాటిచెప్పాలనే ఉద్దేశంతో సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. "రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి... రాష్ట్రానికి వచ్చే అతిథులకు ఇచ్చే జ్ఞాపికలలో ఏటికొప్పాక బొమ్మలను భాగం చేయడం జరిగింది. గతంలో ఈ బొమ్మల తయారీ కళలో నైపుణ్యం చాటినందుకు ఇద్దరు కళాకారులు రాష్ట్రపతి అవార్డు అందుకున్నారు. ఇవాళ ఏటికొప్పాక బొమ్మలతో కూడిన శకటాన్ని రిపబ్లిక్ డే పరేడ్ లో ప్రదర్శించిడం కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం" అని పవన్ కల్యాణ్ వివరించారు.

ఏపీలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు ..

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వాడ వాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ .. రాష్ట్ర ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. గత ప్రభుత్వం భారీ అప్పులు చేసి సమస్యలు సృష్టించిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కు కేంద్రం నుంచి ప్రత్యేక ప్యాకేజీ వచ్చేలా ఈ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. స్వర్ణాంధ్ర విజన్ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని అన్నారు. ప్రజలకు ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆనందం కలగాలనేదే తమ నినాదమని పేర్కొన్నారు. ప్రభుత్వ పది సూత్రాల అమలు ద్వారా అనుకున్న లక్ష్యాలు సాధిస్తామని ఆయన వివరించారు.

ఉత్తరాంధ్రా నుంచే శ్రీకారం చుట్టనున్న జగన్

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : వైసీపీ అధినేత జగన్ జిల్లాల టూర్ కి రంగం సిద్ధం అవుతోంది. సంక్రాంతి పండుగ ముందు ఆయన లండన్‌కి బయలుదేరి వెళ్ళారు. అక్కడ ఆయన తన చిన్న కుమార్తె డిగ్రీ పట్టా ప్రదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అలా కొన్ని రోజుల పాటు కుటుంబంతో ఉల్లాసంగా గడిపి ఈ నెలాఖరుకు ఏపీకి తిరిగి వస్తున్నారు. జగన్ గతంలో చెప్పినట్లుగానే ఫిబ్రవరి తొలి వారం నుంచి జిల్లాల పర్యటనలు చేపడతారని పార్టీ వర్గాలు తెలిపాయి. జగన్ ప్రతీ బుధవారం జిల్లా పర్యటనలు పెట్టుకుంటారు. శుక్రవారం వరకూ ఆయన మూడు రోజుల పాటు అక్కడే బస చేస్తారు. అలా ప్రతీ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గం కార్యకర్తలు నాయకులతో ఆయన భేటీ అవుతారు. వారి నుంచి మొత్తం విషయాలను గ్రహిస్తారు. క్షేత్ర స్థాయిలో పార్టీ ఎలా ఉంది అన్నదే జగన్ ఈ సందర్భంగా వాకబు చేస్తారని అంటున్నారు. ఈ పర్యటనల ముఖ్య ఉద్దేశ్యం పార్టీని పునరుత్తేజం చేయడమే అని అంటున్నారు. దాంతో జగన్ పర్యటనలు జనాల కంటే కూడా ఎక్కువగా పార్టీ జనాలకే ఉద్దేశించి సాగుతాయని అంటున్నారు. మరో వైపు చూస్తే వైసీపీ నుంచి ఎంతో మంది నేతలు ఇటీవల కాలంలో బయటకు వెళ్ళిపోతున్నారు. వారి ప్లేస్ లో కొత్త వారికి చాన్స్ ఇవ్వాలని చూస్తున్నారు. అలాగే యూత్ కి ప్రయారిటీ అని పెట్టుకున్నారు. అలాగే పార్టీలో పనిచేయని వారి విషయంలోనూ ఒకసారి చెప్పి చూసి సీరియస్ గానే రియాక్టు కావాలని అధినాయకత్వం భావిస్తోందిట. నాయకులు జనం నుంచి తయారు అవుతారని పార్టీ పట్ల జనంలో ఆదరణ ఉంటే మళ్ళీ కొత్త నాయకత్వంతో దూసుకుని పోవచ్చు అన్న ఆలోచనతోనే పార్టీ పెద్దలు ఉన్నారని అంటున్నారు. ఇదిలా ఉంటే జగన్ జిల్లాల పర్యటనలు మొత్తం 26 కొత్త జిల్లాలలో సాగుతాయని అంటున్నారు. ఇక జగన్ ఈసారి ఉత్తరాంధ్ర సెంటిమెంట్ ని ఫాలో అవుతారని అంటున్నారు. దాంతో పాటుగా పార్టీ 2024 ఎన్నికల్లో బాగా నష్టపోయింది కాబట్టి ఉత్తరాంధ్ర నుంచి రంగం సిద్ధం చేసుకుంటేనే గాడిలో పడుతుంది అని భావిస్తున్నారుట. ఉత్తరాంధ్రాలోని శ్రీకాకుళం జిల్లా నుంచి జగన్ పర్యటనలు ఉంటాయని చెబుతున్నారు. తొందరలోనే యాక్షన్ ప్లాన్ తో సహా అన్నీ ప్రకటించేందుకు వైసీపీ అధినాయకత్వం సన్నాహాలు చేస్తోంది. ఉత్తరాంధ్రాలో ఇపుడు కూటమి హవా గట్టిగానే ఉంది. దాంతో పాటు వైసీపీకి కేవలం రెండు అసెంబ్లీ సీట్లు మాత్రమే దక్కాయి. దాంతో ఫ్యాన్ పార్టీ రిపేర్లు ఇక్కడ నుంచే మొదలుపెట్టాలని అధినేత భావించారు అని అంటున్నారు. చూడాలి మరి ఉత్తరాంధ్ర జగన్ కి ఏ విధంగా హుషార్ తెప్పిస్తుందో.

దేశ ప్రజలకు ప్రధాని మోదీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు 76వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ రాజ్యాంగాన్ని రూపొందించి ప్రజాస్వామ్యం, గౌరవంతో పాటు ఐక్యతగా దేశ అభివృద్ధి ప్రయాణం సాగేలా కృషి చేసిన మహనీయులందరికీ ఈ సందర్భంగా నివాళులర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుక మన రాజ్యాంగ విలువలను కాపాడుతుందన్నారు. బలమైన సంపన్నమైన దేశాన్ని నిర్మించే దిశగా మన ప్రయత్నాలను బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ మోదీ ట్వీట్ చేశారు. దేశ ప్రజలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రిపబ్లిక్ డే అనేది భారత రాజ్యాంగ విలువలపై విశ్వాసం, సామాజిక సమానత్వం, ప్రజాస్వామ్యంపై అంకితభావానికి చిహ్నమన్నారు. బలమైన గణతంత్రానికి పునాది వేసిన స్వాతంత్ర్య సమరయోధులు, రాజ్యాంగ నిర్మాతలకు ఈ సందర్భంగా నివాళులర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ 76వ గణతంత్ర దినోత్సవం నాడు అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను నిర్మించడంలో ప్రధాని మోదీకి సహకరిస్తామని ప్రతిజ్ఞ చేద్దామన్నారు.

వర్సిటీలపై కేంద్రం పెత్తనాన్ని చూస్తూ ఊరుకోం: సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : రాష్ట్రాల పరిధిలో ఉండే విశ్వవిద్యాలయాలపై పెత్తనం చెలాయించాలని కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను చూస్తూ ఊరుకోబోమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులతో మాట్లాడాలని భావిస్తున్నట్లు చెప్పారు. 32 ఏళ్ల తర్వాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన మొదటి ముఖ్యమంత్రిగా రేవంత్ ఘనత అందుకున్నారు. ఇవాళ హైదరాబాదులోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ క్యాంపస్ లో ఏర్పాటు చేసిన అంబేద్కర్ గారి విగ్రహాన్ని ఆవిష్కరించడంతో పాటు కొత్తగా నిర్మించనున్న మూడు భవనాలకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, యూజీసీ ముసుగులో వర్సిటీలను తమ అధీనంలోకి తీసుకోవాలని కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను వివరిస్తూ తీవ్ర నిరసనను వ్యక్తం చేశారు. రాష్ట్రాల వర్సిటీలపై ఆధిపత్యం చెలాయించాలని చూడటం సాంస్కృతిక దాడిగా అభివర్ణించారు. ఈ విషయంలో మేధావులందరూ ఆలోచనలు చేయాలని పిలుపునిచ్చారు."కేంద్రం, రాష్ట్రాల అధికారాల విషయంలో రాజ్యాంగంలో స్పష్టంగా ఉన్నప్పటికీ దాని స్ఫూర్తికి విరుద్ధంగా చేసే ప్రయత్నాలపై సమష్టిగా కొట్లాడుతామని ప్రధానమంత్రి గారికి విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ కుట్రను మాపై దాడిగానే భావిస్తాం. ఆ ప్రతిపాదనను తక్షణం ఉపసంహరించుకోవాలి. ఒక్కొక్కటిగా ఇలా చేస్తూపోతే చివరకు స్థానిక సంస్థలు, మున్సిపాలిటీలు, జిల్లా పరిషత్ లు కేవలం పన్నులు వసూలు చేసుకునే సంస్థలుగా మిగిలిపోతాయి. కొన్నేళ్లుగా విశ్వవిద్యాలయాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. ముఖ్యమంత్రిగా బాధ్యత తీసుకున్న మరుక్షణం మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసుకోవడానికి ఎంత ప్రాధాన్యత ఇచ్చానో విశ్వవిద్యాలయాల వీసీల నియామకానికి కూడా అంతే ప్రాధాన్యత ఇచ్చాను. వర్సిటీ వీసీల నియామకంలో సామాజిక న్యాయం అనే కోణానికి కూడా ప్రాధాన్యతనిచ్చాం. వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఉస్మానియా యూనివర్సిటీకి దాని చరిత్రలో ఏ రోజూ ఒక దళిత సామాజిక వర్గం నుంచి వచ్చిన వ్యక్తి వైస్ ఛాన్సలర్ గా నియమించబడలేదు. ఆ సామాజిక వర్గం నుంచి విద్యావేత్తను వీసీగా నియమించాం. విశ్వవిద్యాలయాల పునర్నిర్మాణం జరగాలి. మన కళ్ళ ముందే వాటి ప్రతిష్ఠ దిగజారుతుండడం చూస్తూ ఊరుకుంటే మనం ఈ సమాజానికి అన్యాయం చేసిన వాళ్ళమవుతాం.ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ విషయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వివరాలు తెప్పించుకుని సానుకూల నిర్ణయం తీసుకుంటారు. అనుభవం కలిగిన అధ్యాపకుల సేవలను వినియోగించుకోవాలన్న ఆలోచన చేస్తున్నాం. వర్సిటీల్లో ప్రొఫెసర్ల పదవీ విరమణ వయస్సును 65 ఏళ్లకు పెంచాలన్న ఆలోచన ఉంది" అని రేవంత్ రెడ్డి వివరించారు..

హాస్టల్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే విధుల నుంచి తొలగిస్తా...

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : సత్యసాయి జిల్లా సీకే పల్లి బీసీ హాస్టల్ లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందని ఘటనపై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖమంత్రి సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మంత్రి ఆదేశాలతో బీసీ సంక్షేమశాఖాధికారులు భోజనం సదుపాయం కల్పించారు. హెచ్ డబ్ల్యూవోపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం మంత్రి సవిత కలెక్టర్ తోనూ. బీసీ సంక్షేమ శాఖాధికారులతోనూ ఫోన్లో మాట్లాడారు. సీకే పల్లి బాలుర హాస్టల్‌లో మధ్యాహ్న భోజనం ఎందుకు సమకూర్చలేదని మంత్రి ఆరా తీశారు. హాస్టల్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్య ధోరణి సరికాదని మండిపడ్డారు. తక్షణమే విద్యార్థులకు భోజనం సదుపాయం కల్పించాలని, రాత్రికి కూడా ఎటువంటి లోటూ రానివ్వొద్దని స్పష్టంచేశారు. విద్యార్థులను ఆకలితో బాధపడేలా చేసిన సీకే పల్లి బీసీ బాలుర హాస్టల్ హెచ్ డబ్ల్యూవో నారాయణ స్వామిని తక్షణమే విధుల నుంచి తొలగించాలని ఫోన్లో కలెక్టర్ ను మంత్రి సవిత ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో బీసీ సంక్షేమ శాఖాధికారులు భోజనం సదుపాయం కల్పించారు. హెచ్ డబ్ల్యూవోను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ టీఎస్ చేతన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఘటనకు సంబంధించి విచారణ చేపట్టి వివరాలు అందివ్వాలన్నారు. అధికారులపై నమ్మకంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను హాస్టళ్లలో చేర్పిస్తున్నారని, వారిని కంటికి రెప్పలా కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మంత్రి స్పష్టం చేశారు. హాస్టల్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, సహించేది లేదని, అవసరమైతే అటువంటి హెచ్ డబ్ల్యూవోలను, ఇతర సిబ్బందిని విధుల నుంచి తొలగిస్తామని మంత్రి సవిత హెచ్చరించారు.

ఈ రిపబ్లిక్ డే మనకు మరింత ప్రత్యేకం: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త : గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ రిపబ్లిక్ డే మనకు మరింత ప్రత్యేకమని అన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు అవుతుందని, ఇది దేశం మొత్తం గర్వించదగ్గ సందర్భమని రాష్ట్రపతి పేర్కొన్నారు.భరతమాత విముక్తి కోసం త్యాగం చేసిన వారిని స్మరించుకోవాలన్నారు. ఈ ఏడాది బిర్సా ముండా 150వ జయంతిని జరుపుకున్నామని, వెలుగులోకి రాని మరికొందరు ధైర్యవంతులను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా చట్టాలను మార్చుకున్నామని, ఈ ఏడాది కొత్త చట్టాలను రూపొందించి అమల్లోకి తెచ్చామని రాష్ట్రపతి తెలిపారు. మన లక్ష్యాల దిశగా నిజమైన ప్రయాణం సాగుతుందన్నారు. ఇక భారత్ అంతర్జాతీయంగా నాయకత్వం వహించేలా ఎదగడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు.

దావోస్‌లో బిల్ గేట్స్‌తో చంద్రబాబు భేటీ



ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్ లో నేడు మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ తో సమావేశమయ్యారు. దీనిపై చంద్రబాబు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. బిల్ గేట్స్ తో తొలిసారిగా 1995లో కలిశానని... అప్పుడు తమ మధ్య ఐటీ గురించి చర్చ జరిగిందని వెల్లడించారు. ఇప్పుడు 2025లో మరోసారి గేట్స్ తో సమావేశమయ్యానని, అయితే ఈసారి తమ మధ్య ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) అంశం చర్చకు వచ్చిందని చంద్రబాబు వివరించారు. ఎన్నో సంవత్సరాల తర్వాత బిల్ గేట్స్ ను మళ్లీ కలవడం సంతోషం కలిగించిందని తెలిపారు.

బడ్జెట్ - 2025... నిర్మలమ్మ ముందు టాక్స్ పేయర్స్ డిమాండ్స్ ఇవే!

ఫిబ్రవరి 1న ఆర్థిక సంవత్సరానికి (2025 – 26)కి సంబంధించిన బడ్జెట్ ను పార్లమెంట్ లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టబోతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా రకరకాల ట్యాక్సులు, జీఎస్టీ బాదుళ్లతో వాయించారనే విమర్శలు సంపాదించుకున్నట్లు చెప్పే నిర్మలమ్మ నుంచి టాక్స్ పేయర్స్ ఏమి కోరుకుంటున్నారనే విషయంపై సర్వే జరిగింది. అవును... 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ను ప్రవేశ పెట్టబోతున్నారు. ఈ సమయంలో గ్రాంట్ థోంటన్ భారత్ ప్రీ–బడ్జెట్ సర్వే తెరపైకి వచ్చింది. ఈ సందర్భంగా ప్రధానంగా రాబోయే బడ్జెట్ లో ఆదాయపు పన్ను రేట్లు తగ్గాలని అత్యధిక వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు కోరుకుంటున్నట్లు ఈ సర్వే తెలిపింది. ఇందులో భాగంగా... గ్రాంట్ థోంటన్ భారత్ ప్రీ–బడ్జెట్ సర్వేలో సుమారు 57 శాతం మందిది ఇదే మాట అని చెబుతున్నారు. ఈ సమయంలో వ్యక్తిగత పన్ను చెల్లింపుదారుల్లో 72 శాతం మంది కొత్త ఆదాయ పన్ను విధానాన్నే ఎంచుకుంటుండగా.. 63 శాతం మంది కొత్త ఆదాయ పన్ను విధానంలోని ప్రోత్సాహకాలు మరింత పెరగాలని అభిప్రాయపడుతున్నట్లు సర్వే తెలిపింది. అదేవిధంగా... కొత్త పన్ను విధానంలోనూ పన్ను రేట్లు తగ్గాలని సుమారు 46 శాతం మంది డిమాండ్ చేస్తుండగా.. ఈ సారి పన్ను మినహాయింపు పరిమితుల్ని పెంచుతారనే నమ్మకాన్ని సుమారు పాతికశాతం మంది వ్యక్తం చేశారు. ఇక 500 మందికి పైగా పాల్గొన్న ఈ సర్వేలో.. వ్యక్తిగత ఐటీ తగ్గి, వ్యక్తుల ఆదాయం పేరిగేలా నిర్ణయాలుండాలని అంతా కోరుకుంటున్నారు! ఇదే సమయంలో... నేషనల్ పెన్షన్ సిస్టం (ఎన్.పీ.ఎస్) పను మినహాయింపు పరిమితుల్ని పెంచాలని.. ఎన్.పీ.ఎస్. మొత్తాల ఉపసంహరణ నిబంధనల్ని ఇంకా సరళతరం చేయాలని.. దీనివల్ల రిటైర్మెంట్ సేవింగ్స్ కు ఊతమిచ్చినట్లు అవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈవీ వెహికల్స్ వినియోగం పెరిగేలా వాటి కనుగోళ్లపై పన్ను ప్రోత్సాహకాలు అందివ్వాలని అంటున్నారు.

నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్, మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ

ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త : తెలుగు సినీ నటుడు నందమూరి బాలకృష్ణకు పద్మ అవార్డు ప్రకటించింది. కళల రంగంలో బాలకృష్ణకు (ఏపీ) పద్మభూషణ్ అవార్డు వచ్చింది. తెలంగాణ నుంచి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను (ప్రజావ్యవహారాలు) పద్మశ్రీ వరించింది. మిరియాల అప్పారావు (కళలు–ఏపీ), కేఎల్ కృష్ణ (సాహిత్యం–ఏపీ), మాడుగుల నాగఫణిశర్మ (కళలు–ఏపీ), పంచముఖి రాఘవాచార్య (సాహిత్యం–ఏపీ) పద్మశ్రీ అవార్డు వచ్చాయి. కన్నడ నటుడు అనంతనాగ్‌కు (కళలు), తమిళ నటుడు అజిత్ కుమార్ (కళలు), తమిళ సీనియర్ నటి శోభనకు(కళలు), మహారాష్ట్రకు చెందిన శేఖర్ కపూర్ (కళలు), కేరళ హాకీ క్రీడాకారుడు శ్రీజేష్, ఢిల్లీకి చెందిన బబేక్ దేబ్రాయ్ (సాహిత్యం), మహారాష్ట్రకు చెందిన మనోహర్ జోషి (ప్రజావ్యవహారాలు), బీహార్ నుంచి సుశీల్ కుమార్ మోదీ (ప్రజావ్యవహారాలు) పద్మభూషణ్ వచ్చాయి.కేంద్ర ప్రభుత్వం 139 మందికి పద్మ పురస్కారాలు ప్రకటించింది. ఏడుగురికి పద్మ విభూషణ్, 19 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ పురస్కారాలు వచ్చాయి.

ఏపీ హైకోర్టులో ఘనంగా గణతంత్ర్య దినోత్సవ వేడుకలు

రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం అవరణలో 76 వ భారత గణతంత్ర్య దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం సభికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమలుకు ఎటు వంటి విఘాతం కలుగకుండా న్యాయ వ్యవస్థ ఒక గార్డియన్ లా పనిచేస్తున్నదన్నారు. అటు వంటి వ్యవస్థలో పనిచేసే న్యాయమూర్తులు, న్యాయవాదులు ఎంతో బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. సార్వభౌమ సామ్యవాద లౌలిక ప్రజాస్వామ్య గణతంత్ర్య దేశంగా అభివృద్ద పథంలో మన దేశం మరింత ముందుకు వెళ్లేందుకు 76 వ భారత గణతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రతీకగా నిలుస్తాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ 1950 లో ప్రజాస్వామ్య గణతంత్ర్య దేశంగా అవతరించిన భారత దేశం ప్రపంచలోని పలు గణతంత్ర్య దేశాలకు ఆదర్శంగా నిలిచేలా అద్భుతమైన గణతంత్ర్య దేశంగా నేడు ఆవిష్కృతమైందన్నారు. సాంప్రదాయ, ఆధునికతలను మేళవిస్తూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించే విషయంలో మన రాజ్యాంగం ఎంతగానో దోహపడుతున్నదన్నారు. దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలను అన్నింటినీ ఆకళింపుచేసుకుని వాటి పరిష్కారానికై ఎంతో విలువైన రాజ్యాంగాన్ని మనకు అందజేసిన మహోన్నత వ్యక్తులు అందరికీ శిరస్సు వంచి శ్రద్ధాంజలి ఘటించాల్సి ఉందన్నారు. అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ మహోన్నతమైన మన రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షిదంలో న్యాయవాదులు కీలక పాత్రి పోషించాల్సి ఉందన్నారు. కేవలం వారు కోర్టు గదులకే పరిమితం కాకుండా గ్రౌండ్ రియాలటీలను అర్థం చేసుకుని దానికి తగ్గట్టుగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. రాష్ట్ర వ్యాయవాదుల మండలి అధ్యక్షుడు ఎన్.ద్వారకానాథ్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ప్రజా స్వామ్య వ్యవస్థ మనుగడ సాగించడంలో న్యాయ వ్యవస్థ కీలక భూమి పోషిస్తున్నదన్నారు. తద్వారా అన్ని వర్గాల ప్రజలు స్వేచ్చా స్వాతంత్ర్యాలతో అభివృద్ధి పదంలో పయనించేందుకు అవకాశాలు ఏర్పడ్డాయన్నారు. హైకోర్టు న్యాయ వాదుల సంఘం అధ్యక్షులు కె.చిదంబరం మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి సంరక్షకులుగా న్యాయవాదులు పనిచేస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాల్సిన భాధ్యత న్యాయవాదులపై ఉందన్నారు. ఈ గణతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పలువురు న్యాయమూర్తులు, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పి.పొన్నారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండా లక్ష్మీనారాయణ్, అదనపు అడ్వకేట్ జనరల్ ఇ.సాంబశివ ప్రతాప్, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ (ఎఫ్ఎసి) శ్రీనివాస శివరాం, పలువులు రిజిస్ట్రార్లు, బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాజీనామాకు కారణం వ్యక్తిగతమే.. విజయసాయి రెడ్డి స్పష్టీకరణ

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : పదవుల కోసమో, కేసుల మాఫీ కోసమో తాను ఎంపీ పదవికి రాజీనామా చేయలేదని మాజీ ఎంపీ, వైసీపీ నేత విజయసాయి రెడ్డి స్పష్టం చేశారు. ఎంపీ పదవికి రాజీనామా చేయడానికి కారణం పూర్తిగా వ్యక్తిగతమని వివరణ ఇచ్చారు. దైవాన్ని నమ్మే వ్యక్తిగా అబద్ధాలు చెప్పడం, మోసం చేయడం తనకు తెలియదన్నారు. కేసులను ధైర్యంగా ఎదుర్కొంటానని, దేనికీ ఎవరికీ భయపడబోనని తేల్చిచెప్పారు. శనివారం ఉదయం రాజ్యసభ చైర్మన్ (ఉపరాష్ట్రపతి)కి రాజీనామా పత్రం అందించానని, ఆయన ఆమోదం తెలిపారని విజయసాయి రెడ్డి తెలిపారు. రాజీనామా గురించి వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ తో ఫోన్ లో మాట్లాడానని చెప్పారు. అన్నీ వివరంగా మాట్లాడాకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.ఇకపై తాను రాజకీయాలకు దూరంగా ఉంటానని విజయసాయి రెడ్డి స్పష్టం చేశారు. తనకు ఎలాంటి వ్యాపారాలు లేవని ఈ సందర్భంగా క్లారిటీ ఇచ్చారు. వైఎస్ కుటుంబంతో తనకు మూడు తరాలుగా అనుబంధం ఉందని గుర్తుచేశారు. వైఎస్ కుటుంబంతో తనకు ఎన్నడూ విభేదాలు లేవని, ఆ కుటుంబానికి తాను ఎన్నడూ వ్యతిరేకంగా మాట్లాడలేదని తెలిపారు. నిరంతరం తాను పార్టీ కోసమే పనిచేశానని చెప్పారు. తన రాజీనామాపై జరుగుతున్న తప్పుడు ప్రచారం ఆపాలని విజయసాయి రెడ్డి మీడియాకు విజ్ఞప్తి చేశారు. కేవీ రావుతో తనకెలాంటి పరిచయం లేదని, ఎక్కడైనా ఎదురుపడితే నమస్కారం అంటే నమస్కారం అని పలకరించుకోవడం వరకేనని తెలిపారు. తాను రాజకీయాల్లోకి ప్రవేశించిన రోజులు వేరు.. ఇప్పుడున్న రాజకీయ పరిస్థితులు వేరని విజయసాయి రెడ్డి తెలిపారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రానికి, పార్టీకి తాను న్యాయం చేయలేననే భావనతోనే రాజీనామా చేశానని చెప్పారు. తనకన్నా మెరుగ్గా పనిచేసే నేత తన స్థానంలోకి వస్తే ప్రజలకు ప్రయోజనం కలుగుతుందనే ఉద్దేశమే తప్ప వేరే కారణంలేదన్నారు. కాకినాడ పోర్టు వ్యవహారంలో నమోదైన కేసులో ఈడీ తనను ఏ2 గా చేర్చించిందని చెప్పారు. ఆ కేసును తాను చట్టపరంగానే డీల్ చేస్తానని వివరించారు. 'నా పిల్లల సాక్షిగా చెబుతున్నా.. కాకినాడ పోర్ట్ వ్యవహారంలో నాకు సంబంధం లేదు' అని అన్నారు. ప్రస్తుతం తాను తన ఎంపీ పదవికి రాజీనామా చేశానని, వైసీపీ పార్టీకి ఇంకా రాజీనామా చేయలేదని తెలిపారు. నేడో రేపో పార్టీకి కూడా రాజీనామా చేస్తానని విజయసాయి రెడ్డి వివరించారు. బెంగళూరులో ఒక ఇల్లు, విజయవాడలో ఉన్న రెండు ఇళ్లల్లో ఒకటి మాత్రమే తనదని, విశాఖపట్నంలో ఓ అపార్ట్ మెంట్ ఉందని.. ఇవికాకుండా తనకు ఎలాంటి ఆస్తులు లేవని విజయసాయి రెడ్డి స్పష్టం చేశారు.

మహారాష్ట్ర, తెలంగాణలను ఉద్దేశించి దావోస్‌లో చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : దావోస్‌లో ఏపీ, తెలంగాణ, మహారాష్ట్రల పెట్టుబడుల ఆకర్షణ వేట కొనసాగు తోంది. మూడు రాష్ట్రాల సీఎంలు తమ రాష్ట్రాలకు వీలైనంత ఎక్కువ పెట్టు బడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. మరోవైపు అక్కడ జరిగిన 'కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్' సమావేశంలో ముగ్గురు సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి, ఫడ్నవిస్ లు పాల్గొన్నారు. ముగ్గురూ ఒకే వేదికను పంచుకున్నారు. దేశం ఒక యూనిట్‌గా పెట్టుబడులను రాబట్టేలా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమం సందర్భంగా ఏఐ, రక్షణ, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో పెట్టుబడులకు సంబంధించిన అంశాలు చర్చకు వచ్చాయి. రాష్ట్రాల ఆకాంక్ష ఏ విధంగా ఉంది? గ్లోబల్ కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టడం అనే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఓ ప్రశ్నకు బదులిస్తూ చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వాళ్లు (తెలంగాణ, మహారాష్ట్ర) వెరీ రిచ్. మేము వెరీ పూర్ అంటూ రేవంత్ రెడ్డి, ఫడ్నవిస్‌లను చూస్తూ కామెంట్ చేశారు. ముంబై 'ఫైనాన్షియల్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా' అని... తెలంగాణ 'హైయ్యెస్ట్ పర్ క్యాపిటా ఇన్ ఇండియా' అని చంద్రబాబు అన్నారు. మేము వెరీ పూర్ అని చమత్కరించారు. దీంతో, అక్కడ ఒక్కసారిగా నవ్వులు విరబూశాయి.

ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం.. సరస్వతీ పవర్‌ప్లాంట్‌కు కేటాయించిన భూముల రిజిస్ట్రేషన్ రద్దు

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డికి చెందిన సరస్వతీ పవర్ ప్లాంట్ కోసం కొనుగోలు చేసిన భూముల రిజస్ట్రేషన్‌ను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. ఈ భూముల్లో అసైన్డ్, ప్రభుత్వ భూములు ఉన్నట్టు గుర్తించి ఈ నిర్ణయం తీసుకుంది. పల్నాడు జిల్లాలో సరస్వతీ పవర్ ప్లాంట్ కోసం కొనుగోలు చేసిన భూముల్లో మాచవరం మండలం వేమవరంలో 20 ఎకరాలు, పిన్నెల్లిలో 4.84 ఎకరాలను అసైన్డ్ భూములుగా ప్రభుత్వం గుర్తించింది.సరస్వతీ పవర్ కోసం కొనుగోలు చేసిన భూముల్లో అసైన్డ్ భూములు ఉన్నట్టు గుర్తించిన మాచవరం తహసీల్దార్ క్షమారాణి ఈ విషయమై కలెక్టరకు నివేదిక ఇచ్చారు. ప్రభుత్వ భూములను తప్పుగా రిజిస్ట్రేషన్ చేశారని, ఆ దస్తావేజులను రద్దు చేసేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా కోరారు. కలెక్టర్ అనుమతితో నిన్న మొత్తం 24.85 ఎకరాల అసైన్డ్ భూములను రద్దు చేసినట్టు క్షమారాణి వెల్లడించారు. పల్నాడు జిల్లాలోని చెన్నయపాలెం, వేమవరం, పిన్నెల్లి, తంగెడ గ్రామాల్లో మొత్తం 1,250 ఎకరాలను సరస్వతీ పవర్ ప్లాంట్ యాజమాన్యం కొనుగోలు చేసింది. అయినప్పటికీ ఆ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. ఆ భూముల్లో అటవీ, అసైన్డ్ భూములు ఉన్నాయని పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. దీంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆ ప్రాంతంలో పర్యటించారు. ఈ భూములపై మరింత లోతుగా దర్యాప్తు చేయాలని ఆదేశించారు. అధికారులు ఇటీవల సరస్వతి పవర్ ప్లాంట్ భూములపై సర్వే చేశారు. ఆరోపణలు వచ్చినట్టుగా వీటిలో అటవీ భూములు లేవని అధికారులు గుర్తించారు. అయితే, అదే సమయంలో 24.84 ఎకరాల అసైన్డ్ భూములు ఉన్న విషయం బయటపడింది. ఈ క్రమంలో తహసీల్దార్ నివేదిక అనంతరం కలెక్టర్ ఆదేశాలతో పిడుగురాళ్ల సబ్ రిజిస్ట్రార్ భూముల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేశారు.

దడ పుట్టిస్తున్న డ్రోన్లు.. మావోయిస్టుల ఏరివేతలో బలగాలకు తోడ్పాటు

దండకారుణ్యం మావోయిస్టులకు పెట్టని కోట. దుర్భేద్యమైన ఆ కోటలో అడుగు పెట్టాలంటే ఒకప్పుడు పోలీసులకు హడల్. ఎటువైపు నుంచి ముప్పు ముంచుకొస్తుందనే టెన్షన్ తో భద్రతాబలగాలు అటువైపు వెళ్లేందుకు సాహసించేవి కావు. ఇన్ఫార్మర్లు సమాచారంతోనే ముందుకు కదులుతూ ఆపరేషన్లు నిర్వహించేవి. కానీ, ఇప్పుడు పరిస్థితి మారిందే దండకారుణ్యమే కాదు మావోయిస్టులకు గట్టి పట్టున్న కాంకేర్ అడవుల్లోనూ మృత్యుకేళీతో మావోయిస్టులు ఒక్కొక్కరుగా హతమవుతున్నారు. ఒకప్పుడు జనతన సర్కార్ నడిపిన తమ నేలలో ఇలాంటి పరిస్థితి వస్తుందని మావోయిస్టులు ఊహించి ఉండరు. దానికి కారణం వారు టెక్నాలజీని సరిగా అంచనా వేయలేకపోవడమే. టెక్నాలజీని సమర్థంగా వాడుకుంటున్న పోలీసు యంత్రాంగం మావోయిస్టులపై పట్టు బిగిస్తోంది. మావోయిస్టుల పాలిట మృత్యు పాశం.. పోలీసులకు విజయ దరహాసం అందిస్తున్న ఆ టెక్నాలజీ పేరే డ్రోన్. దండకారణ్యంలో సైలెంట్ కిల్లర్స్ గా పనిచేస్తున్న మానవ రహిత డ్రోన్లు (యూఏవీ)లు 50 ఏళ్ల ఉద్యమానికి ముగింపు పలకడంలో కీలకంగా పనిచేస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేదు. వాతావరణ అనుకూల, ప్రతికూలతలతో పనిలేదు. ఇచ్చిన టార్గెట్ను సైలెంటుగా పూర్తి చేయడమే యూవీఏల గొప్పతనం. దేశ సరిహద్దు భద్రత కోసం సైన్యం వాడిన యూవీఏలను మావోయిస్టుల ఏరివేతకు వాడాలని కేంద్రం నిర్ణయించిన నుంచి పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. అంతవరకు తమను టచ్ చేయలేరని మావోయిస్టులు గొప్పగా చెప్పుకున్న ప్రాంతమైన దండకారుణ్యంలోనే నిలువ నీడలేని పరిస్థితి ఎదురైంది. 2026 మార్చిలోగా నక్సలిజంను అంతమొందిస్తామని ప్రతినబూనిన కేంద్ర సర్కార్ భద్రతా బలగాలకు 28 యూవీఏలను సమకూర్చింది. వీటి రంగం ప్రవేశంతో యుద్ధరీతి పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు ఎన్ కౌంటర్ జరిగితే రెండు వైపులా నష్టం ఉండేది. కానీ యూవీఏలు యాక్షన్ లోకి దిగిన తర్వాత వార్ వన్ సైడ్ అయింది. వరుస ఎన్ కౌంటర్లలో పదుల సంఖ్యలో ఉద్యమకారులు నేలకొరుగుతున్నారు. ముఖ్యంగా పార్టీ టాప్ లీడర్లు కూడా ఈ ఎన్ కౌంటర్లతో ప్రాణాలు కోల్పోవడం మావోయిస్టు పార్టీ ఊహించలేకపోయింది. మావోయిస్టుల ఏరివేతకు డ్రోన్స్ వాడాలని కేంద్రం నిర్ణయించడంతోనే నక్సలిజం పతనం మొదలైందని అంటున్నారు. భూమిపై ఉండగా సౌండ్ చేసి స్విచబుల్ డ్రోన్స్ గాలిలో ఎగిరాక ఎలాంటి శబ్దం చేయవు. సైలెంటుగా గగతనంలో ఎగురుతూ టార్గెట్స్ ను గుర్తించడంతోపాటు అక్కడికి చేరుకోడానికి సురక్షితమైన మార్గాన్ని సూచిస్తుండటంతో భద్రతాబలగాల పని సులవు అవుతోంది. అడవులు, కొండలు, గుట్టలు, నదీ ప్రాంతాలు ఇలా ఎంతో క్లిష్టమైన ప్రాంతంలో కూడా డ్రోన్స్ పనిచేస్తున్నాయి. ఏరియల్ సర్వెలైన్స్ ద్వారా కూబింగ్ ఆపరేషన్ తేలికైపోయింది. ఇన్ఫార్మర్ వ్యవస్థతో పనిలేకుండా పోయింది. ఆకాశంలో ఉదయం, రాత్రి అన్న తేడా లేకుండా డ్రోన్స్ పనిచేస్తున్నాయి. టార్గెట్స్ ను గుర్తిస్తున్నాయి. ఆకాశంలో ఎగురుతూ మావోయిస్టుల కదలికలను ఎప్పటకప్పుడు చేరవేస్తుండటం వల్ల వారి ఉనికి కనిపెట్టడంలో పోలీసులు పెద్దగా శ్రమ పడాల్సిన అవసరం లేకుండా పోయింది. 2022 నుంచి దండకారుణ్యంలో డ్యూటీ చేస్తున్న డ్రోన్లు పోలీసు, భద్రతాబలగాలకు చెప్పుకోదగ్గ విజయాలను అందించాయి. ఒకసారి టేకాఫ్ అయిన తర్వాత ఏకధాటిగా రెండున్నర గంటల పాటు గాలిలో ఎగురుతూ ఫొటోలు, వీడియోలు చిత్రీకరించడంతోపాటు లైవ్ లోకేషన్ షేర్ చేయడం స్విచబుల్ డ్రోన్స్ ప్రత్యేకత. గగనతలంలో ఎలాంటి శబ్దం చేయకుండా ఎరిగే డ్రోన్స్ ను మావోయిస్టులు గుర్తించడంలో విఫలమవుతున్నారు. అంతేకాకుండా ఆధునిక టెక్నాలజీ వాడి ఈ డ్రోన్స్ తయారు చేయడం వల్ల సత్ఫలితాలనిస్తోంది. స్టెల్త్ మోడ్ లో పనిచేసే డ్రోన్ లు సైలెంట్ గా తమ పనిచేయడంతోపాటు 25 ఎక్స్ సామర్థ్యంతో జూమ్ కెమెరాతో ఫొటోలు వీడియోలు తీస్తున్నాయి. ఆకాశం నుంచి నేలపై లేదా, నది, అడవి ఇలా ఎక్కడైనా వెయ్యి మీటర్ల దూరం నుంచే స్పష్టమైన చిత్రాలను చిత్రీకరించడం వీటి గొప్పతనం. రాత్రి వేళల్లో కూడా టార్గెటును గుర్తించేలా థర్మల్ కెమెరా పనిచేస్తుంది. దీని సహాయంతో మనుషులు అలికిడిని గుర్తించడంతోపాటు వారు మావోయిస్టులా? ఆదివాసీలా? వారి వద్ద ఆయుధాలు ఏమైనా ఉన్నాయా? ఎంత మంది ఉన్నారు? ఏం చేస్తున్నారు? అనేది ఎప్పటికప్పుడు భద్రతా బలగాలకు చేరిపోతోంది. అధికారిక సమాచారం ప్రకారం దండకారుణ్యంతోపాటు కాంకేర్ అడవుల్లో మొత్తం 28 డ్రోన్స్ పనిచేస్తున్నాయి. ఇవి 15 కిలోమీటర్ల పరిధిలో ఏరియల్ సర్వెలైన్స్ నిర్వహిస్తూ కమాండ్ కంట్రోల్ సెంటరుకు సమాచారం ఇస్తుంది. ఈ సమాచారాన్ని విశ్లేషించుకుని క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న బలగాలకు గైడెన్స్ ఇస్తుండటం వల్ల మావోయిస్టుల కోటలో పోలీసులు పాగా వేయగలిగారని చెబుతున్నారు. డ్రోన్స్ రంగంలోకి దిగిన తర్వాత ఒక్కసారిగా పరిస్థితిలో మార్పు వచ్చింది. మావోయిస్టులకు సేఫ్ ప్లేస్ అన్నదే లేకుండా పోయింది. గత ఆరు నెలలుగా భద్రతా బలగాలు ఎక్కువగా డ్రోన్స్ వాడుతుండటంతో మావోయిస్టుల ఏరివేత వేగవంతమైంది. ఇటీవల జరిగిన ఆరు ప్రధాన ఎన్‌కౌంటర్లలో డ్రోన్స్ కీలకంగా మారాయి. గత మూడు ఎన్‌కౌంటర్లలో సగటును 12 మంది మరణించేందుకు కారణమయ్యాయి. మావోయిస్టుల ఏరివేతలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్న డ్రోన్ సమాచారంతో అత్యంత భద్రత మధ్య ఉండే మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులను బలగాలు ఈజీగా టార్గెట్ చేయగలుగుతున్నాయి. రెండు రోజుల క్రితం ఎన్‌కౌంటర్ లో కూడా మావోయిస్టు నేత చలపతిని ఇదేవిధంగా మట్టుబెట్టాయి. చలపతికి మూడంచెల భద్రతా ఏర్పాట్లు ఉంటాయి. కానీ, డ్రోన్ గైడెన్స్ తో ఒక్కో అంచెను ఛేదించుకుంటూ ముందుకెళ్లిన పోలీసులు చలపతిని మట్టుబెట్టినట్లు చెబుతున్నారు. ఇవే పరిస్థితులు కొనసాగితే మావోయిస్టుల కోటగా చెప్పే అబూజ్ మడ్, కాంకేర్ అడవులను ఉద్యమకారులు ఖాళీ చేయక తప్పదని అంటున్నారు.

అమరావతి నిర్మాణానికి రూ.11 వేల కోట్లు... నిధుల విడుదలకు హడ్కో ఆమోదం

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఏపీ రాజధాని అమరావతికి హడ్కో శుభవార్త చెప్పింది. అమరావతి నిర్మాణానికి రూ. 11 వేల కోట్ల నిధుల విడుదలకు హడ్కో అంగీకారం తెలిపింది. దీనిపై ఏపీ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పందించారు. అమరావతి నిర్మాణానికి రూ. 11 వేల కోట్ల నిధుల కోసం హడ్కోతో సంప్రదింపులు జరిపామని వెల్లడించారు. హడ్కో నిర్ణయంతో రాజధాని పనులు వేగవంతం అవుతాయని తెలిపారు. ఏపీ రాజధాని అమరావతి నిర్మాణం కోసం హడ్కో గతంలోనే రూ. 11 వేల కోట్లు కేటాయించింది. దీనిపై గతేడాది అక్టోబరులోనే మంత్రి నారాయణ హడ్కో సీఎండీ సంజయ్ కులశ్రేష్టతో సమావేశమై నిధుల విడుదలపై చర్చించారు. హడ్కో నుంచి రుణం విడుదలకు ఏపీ ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలు, నిధుల వినియోగం తీరుతెన్నులను మంత్రి నారాయణ అప్పట్లోనే హడ్కో సీఎండీకి వివరించారు. ఈ నేపథ్యంలో, తాజాగా ముంబయిలో జరిగిన హడ్కో బోర్డు సమావేశంలో నిధుల విడుదలకు ఆమోదం లభించింది.

జనసేన పార్టీ శ్రేణులకు పవన్ కల్యాణ్ కీలక సందేశం

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన పార్టీ శ్రేణులకు కీలక సందేశం అందించారు. ప్రియమైన జనసైనికులకు, వీరమహిళలకు, జనసేన నాయకులకు నా హృదయపూర్వక నమస్కారం... అంటూ బహిరంగ లేఖ రాశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో జనసేన-టీడీపీ-బీజేపీలతో కూడిన ఎన్డీయే కూటమి సాధించిన అద్వితీయ ఘనవిజయం చారిత్రాత్మకం అని పేర్కొన్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ సాగించిన నిరంకుశ పాలనపై, పాలకుల అవినీతిపై, సంఘ విద్రోహ చర్యలపై, చట్టసభల్లో వారు చేసిన జుగుప్సాకర వ్యవహార శైలిపై, శాంతిభద్రత వైఫల్యాలపై ప్రజలు విసుగుచెందారని పవన్ పేర్కొన్నారు.

"అభివృద్ధికి తావులేకుండా చేసి, రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్ గా మార్చడంతో... ప్రజలు అనుభవం కలిగిన, భావితరాల భవిష్యత్ గురించి ఆలోచించే నేతల కూడిన కూటమిపై నమ్మకం ఉంచారు. దాని ఫలితమే 94 శాతం విజయంతో 175కి 164 స్థానాలను ఎన్డీయే కూటమికి లభించాయి. అదే సమయంలో... జనసేన పార్టీ 100 శాతం స్ట్రయిక్ రేట్ తో... పోటీ చేసిన 21 అసెంబ్లీ స్థానాలు, 2 ఎంపీ స్థానాల్లో ఓటమి అనేది లేకుండా అన్నింటినీ గెలుచుకుంది. ప్రజలు అందించిన ఈ విజయాన్ని బాధ్యతగా భావిస్తున్నాం. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో... కేంద్రం సహాయసహకారాలతో చిత్తశుద్ధితో ముందుకు వెళుతున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 7 నెలల కాలంలో రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి. మారుమూల గ్రామాల్లో సైతం రోడ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన జరుగుతోంది. 5 కోట్ల మంది ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుని, యువతకు పాతికేళ్ల భవిష్యత్తు అందించాలన్న దృఢ సంకల్పంతో పనిచేస్తున్నాం. ఇటువంటి పరిస్థితుల్లో కూటమిలోని మూడు పార్టీల శ్రేణులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. అనవసరమైన వివాదాల జోలికి, విభేదాల జోలికి వెళ్లవద్దు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలపై, కూటమి అంతర్గత విషయాలపై వ్యక్తిగత అభిప్రాయాలు వెల్లడించవద్దు, బహిరంగంగా చర్చించవద్దు. నేను ఏ రోజూ పదవుల కోసం రాజకీయాలు చేయలేదు, ఇక ముందు కూడా అలాంటి రాజకీయాలు చేయను. నాకు తెలిసింది కష్టాల్లో ఉన్నవారి కన్నీళ్లు తుడవడం, నేను పుట్టిన నేలను అభివృద్ధి చేయడం మాత్రమే. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించి కూటమి ఔన్నత్యాన్ని అర్థం చేసుకుని మనస్ఫూర్తిగా ముందుకు సాగాలని విజ్ఞప్తి చేస్తున్నాను. మార్చి 14న జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజున పార్టీ భవిష్యత్ లక్ష్యాల గురించి సమగ్రంగా చర్చించుకుందాం" అంటూ పవన్ కల్యాణ్ తన లేఖలో పేర్కొన్నారు.

అందుకే విజయసాయిరెడ్డి రాజీనామా చేశారు: హోంమంత్రి అనిత

విశాఖ, నేటి పత్రిక ప్రజావార్త : విజయసాయిరెడ్డి రాజీనామాపై ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించారు. ఆయనకి గొడ్డలి కలలోకి వచ్చిందేమో.. అందుకే భయపడి రాజీనామా చేసి ఉండొచ్చని సెటైర్లు వేశారు. అయితే, రాజకీయాల్లో ఉన్నా లేకపోయినా చేసిన తప్పునకు శిక్ష అనుభవించాల్సిందేనని అని తెలిపారు. కాగా, ఈరోజు విశాఖ జువైనల్ హోమ్‌ను సందర్శించిన మంత్రి అనిత.. పిల్లలను రక్షించే బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. దీన్ని ఎవరో గుర్తుచేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైసీపీపై ఆమె తీవ్ర విమర్శలతో విరుచుకుపడ్డారు. గత ఐదేళ్లు అబద్ధాలతో గడిపేశారని.. ఇప్పుడు కూడా ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఇక దావోస్ పర్యటనకు వెళ్లిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్... రాష్ట్రానికి ఒక్క పెట్టుబడి కూడా తీసుకురాలేదని వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలపై కూడా అనిత స్పందించారు. గత ఐదేళ్లలో దావోస్‌లో నాలుగుసార్లు సమ్మిట్ జరిగితే ఒక్కసారి మాత్రమే వెళ్లొచ్చారని మాజీ సీఎం జగన్‌ను విమర్శించారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందని, పెట్టుబడులు రావడం లేదంటూ మాజీ మంత్రి రోజా చేసిన విమర్శలపైనా అనిత ఘాటుగా స్పందించారు. ఒకవేళ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తే.. వైసీపీ వాళ్లు ఈ 7 నెలల్లో రోడ్ల మీదకు వచ్చే పరిస్థితి ఉండేది కాదన్నారు.

అసెంబ్లీ సమావేశాలు ఏడాదిలో 75 రోజులైనా జరగాలి:శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు

అమరావతి,నేటి పత్రిక ప్రజావార్త : ప్రజా సమస్యలపై లోతైన చర్చ జరగాలంటే అసెంబ్లీ సమావేశాలు ఏడాదిలో కనీసం 75 రోజుల పాటు జరగాల్సిన అవసరం ఉందని రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు అభిప్రాయపడ్డారు.76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర అసెంబ్లీ భవనం వద్ద ఆదివారం జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన తదుపరి మువన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ ముందుగా గతణంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.1950 జనవరి 26వ తేదీన మన రాజ్యాంగం అమలులోకి వచ్చి నేటికి 76 వసంతాలు పూర్తయ్యాయన్నారు. మన రాజ్యాంగం దేశ పౌరులు అందరికీ స్వేచ్ఛ,సమానత్వం,ఆత్మగౌరవం,ఓటు హక్కును కల్పించిందిందని ఓటు హక్కు ద్వారా మనకు మనమే ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకునే అధికారాన్ని కూడా రాజ్యాంగం కల్పించిందన్నారు.అంతేగాక మన రాజ్యాంగ నిర్మాతల దూరదృష్టి వల్ల కాలానుగుణంగా ఎదురయ్యే ప్రతి బంధకాలను తొలగించుకునేందుకు రాజ్యాంగాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు రాజ్యాంగాన్ని సవరించుకునే వెసులుబాటు కల్పించడం జరిగిందని ఆప్రకారం ఇప్పటి వరకూ మన రాజ్యాంగాన్ని106 సార్లు సవరించు కున్నామని గుర్తు చేశారు.రాజ్యాంగం అమలులోకి వచ్చి ఇన్నాళ్ళయినా సమాజంలో పేదరికం,నిరక్షరాస్యత,అవినీతి, అసమానతలు,లింగవివక్షత,ఉగ్రవాదం,మతతత్వం,మాదక ద్రవ్యాల వాడకం,మహిళలపై హింస వంటి అనేక సవాళ్ళు నేడు మనముందు ఉన్నాయని వా

అస్సాం సర్కార్ పై సుప్రీం కోర్టు అగ్రహం .. సీఎస్‌కు నోటీసు

ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త :అస్సాం ప్రభుత్వ తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మతియా తాత్కాలిక శిబిరంలో 270 మంది విదేశీయులను నిర్బంధించడానికి గల కారణాలు చెప్పకపోవడంపై సుప్రీం కోర్టు సీరియస్ అయింది. తదుపరి విచారణకు అస్సాం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా హాజరుకావాలని జస్టిస్ అభయ్ ఎస్ ఓక్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్ లోపభూయిష్టంగా ఉందని, తాము కోరిన వివరాలు అందులో లేవని బుధవారం జరిగిన విచారణ సందర్భంగా ధర్మాసనం మండిపడింది. డిసెంబర్ 9న విచారణ సమయంలో విదేశీయుల నిర్బంధానికి గల కారణాలు తెలుపడంతో పాటు వారిని దేశం నుంచి పంపించి వేయడానికి తీసుకుంటున్న చర్యలు తెలియజేయాలని ధర్మాసనం ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ ఇందుకు ఆరు వారాల సమయం ఇచ్చింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన అఫిడవిట్‌లో ఆ వివరాలు ఏమీ లేవని, విదేశీయులను ఇంకా నిర్బంధ శిబిరాల్లోనే కొనసాగించేందుకు సరైన వివరణ ఇవ్వలేదని ధర్మాసనం పేర్కొంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి సరిగాలేదని ధర్మాసనం ఆక్షేపించింది.

ఏఐజీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డికి అరుదైన గౌరవం..

దేశంలో మూడు 'పద్మ' పురస్కారాలు అందుకున్న ఏకైక వైద్యుడిగా రికాం

ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త : హైదరాబాద్‌లోని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ (ఏఐజీ) ఆసుపత్రి చైర్మన్, గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ దువ్వూరి నాగేశ్వరరెడ్డి దేశంలోనే అత్యంత అరుదైన రికార్డు సాధించారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆయనకు దేశంలోని రెండో అత్యున్నత పౌరపురస్కారమైన 'పద్మవిభూషణ్'ను ప్రకటించింది. ఇప్పటికే ఆయన 'పద్మశ్రీ', 'పద్మభూషణ్' అవార్డులు అందుకున్నారు. తాజాగా పద్మవిభూషణ్ కూడా రావడంతో మూడు పద్మ పురస్కారాలు అందుకున్న ఏకైక వైద్యుడిగా రికార్డులకెక్కారు. డాక్టర్ నాగేశ్వరరెడ్డిది విశాఖపట్నం. కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్, మద్రాస్ మెడికల్ కాలేజీలో ఎండీ, చండీగఢ్‌లోని పీజీఐఎంఈఆర్‌లో డీఎం పూర్తిచేశారు. హైదరాబాద్ నిమ్స్‌లో గ్యాస్ట్రో ఎంటరాలజీ నిపుణుడిగా సేవలు అందించిన ఆయన ఆ తర్వాత ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ ఆసుపత్రిని స్థాపించారు. వైద్యంలో సరికొత్త ఆవిష్కరణలు, విద్య, పరిశోధన, రోగుల సేవలకు తన జీవితాన్ని ఆయన అంకితం చేశారు. ప్రస్తుతం ఏఐజీ ఆసుపత్రి 40 రకాల సేవలు అందిస్తోంది. పెరోరల్ ఎండోస్కోపిక్ మయోటమీ (పీపోఈఎం)ను పరిచయం చేసిన తొలి వైద్యుడిగా నాగేశ్వరరెడ్డి పేరు సంపాదించారు. ఎండోస్కోపీ పిత్తవాహిక చికిత్స కోసం ఉపయోగించేందుకు నాగిస్టంట్‌ను అభివృద్ధి చేశారు. ప్రపంచ ఎండోస్కోపీ ఆర్గనైజేషన్‌కు తొలి భారతీయ అధ్యక్షుడిగా పనిచేశారు. అలాగే, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవల కోసం ఏషియన్ హెల్త్‌కేర్ ఫౌండేషన్ (ఏహెచ్ఎఫ్)ను స్థాపించారు. కరోనా సమయంలో డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, ఆయన బృందం వైరస్‌పై పోరాటంలో కీలకంగా వ్యవహరించింది. అలాగే, కొవిడ్-19 రోగుల్లో జీర్ణశయాంతర సమస్యలపై చికిత్సలకు ప్రొటోకాల్‌ను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించారు. మాస్టర్ ఆఫ్ ది వరల్డ్ గ్యాస్ట్రోఎంటరాలజీ ఆర్గనైజేషన్ అవార్డు, జీర్ణశయాంతర ఎండోస్కోపీ రంగంలో అత్యున్నత గౌరవమైన రుడాల్ఫ్ వి.షిండ్లర్ అవార్డులు అందుకున్నారు. నాగేశ్వరరెడ్డి భార్య క్యారల్ యాన్‌రెడ్డి డెర్మటాలజిస్ట్‌గా సేవలు అందిస్తున్నారు.

మూడో మేనిఫెస్టో విడుదల చేసిన అమిత్ షా

ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త : ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ, ఆప్, కాంగ్రెస్ పార్టీలు శక్తివంచన లేకుండా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి. ఢిల్లీ ఓటర్లను ఆకట్టుకునేలా అన్ని పార్టీలు ఆకర్షణీయమైన హామీలను గుప్పిస్తున్నాయి. ఈసారి ఎలాగైనా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించాలని బీజేపీ గట్టి పట్టుదలతో ఉంది. ఇప్పటికే బీజేపీ రెండు మేనిఫెస్టోలను విడుదల చేసింది. తాజాగా మూడో మేనిఫెస్టోను కేంద్ర హోం మంత్రి అమిత్ షా విడుదల చేశారు. సంకల్ప పత్ర-3 పేరుతో మూడో మేనిఫెస్టోను అమిత్ షా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలు ఆగిపోవని చెప్పారు. అన్ని హామీలను బీజేపీ నెరవేరుస్తుందని తెలిపారు. అమిత్ షా విడుదల చేసిన మేనిఫెస్టోలో 2025 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బీజేపీ విజన్, కీలక వాగ్దానాలను పొందుపరిచారు. మేనిఫెస్టో అంటే విశ్వసనీయత అని, తాము ఇచ్చినవి ఫేక్ వాగ్దానాలు కావని అమిత్ షా అన్నారు. 1.08 లక్షల మంది ప్రజలు, 62 వేల గ్రూపుల సలహాలు, సూచనలు తీసుకుని ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా మేనిఫెస్టోను రూపొందించామని తెలిపారు. ఢిల్లీ ప్రజలను ఆప్ మభ్యపెట్టే ప్రయత్నంచేస్తోందని అమిత్ షా విమర్శించారు. జల్ బోర్డ్ స్కామ్, డీటీసీ స్కామ్, సీసీటీవీ స్కామ్, మెడికల్ టెస్ట్ స్కామ్, ఎక్సైజ్ స్కామ్ వంటి కుంభకోణాల్లో ఆప్ చిక్కుకుందని అన్నారు. ఢిల్లీకి ఉజ్వల భవిష్యత్తును ఇచ్చే బీజేపీని ఎన్నుకోవాలని ఓటర్లను కోరారు.

విషప్రచారాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి: సజ్జల

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఇవాళ వైసీపీ కేంద్ర కార్యాలయంలో కీలక సమావేశం జరిగింది. మీడియా కమ్యూనికేషన్స్ అంశంపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. వర్క్ షాప్ ను ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఏ రాజకీయ పార్టీ చేయనంత గొప్పగా వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు మేలు చేసిందని అన్నారు. అయితే, చేసిన మంచిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులపై ఉందని స్పష్టం చేశారు. అదే సమయంలో, తాజా పరిణామాలపై నేతలు అవగాహన పెంచుకోవాలని సజ్జల సూచించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏంచేస్తుందో గమనించాలని తెలిపారు. సమర్థ వాదనతో ప్రజల్లో సానుకూలత సంపాదించాలని, ప్రభుత్వ విష ప్రచారాన్ని ఎదుర్కొనేందుకు కూడా పార్టీలో ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని అన్నారు. 2019లో కూడా వైసీపీకి వ్యతిరేకంగా మీడియాలో ఓ వర్గం వ్యతిరేకంగా భారీ ఎత్తున దుష్ప్రచారం చేసిందని, అయినా కూడా పార్టీ అధికారంలోకి వచ్చిందని సజ్జల గుర్తుచేశారు. టీడీపీ పూర్తిగా మీడియా ప్రచారం అండతోనే నడుస్తోందని, ఆ పార్టీకి కొంత బలమైన అనుకూల మీడియా మద్దతు ఉందని పేర్కొన్నారు. దాంతో అబద్ధాలను కూడా వేగంగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ అనుకూల మీడియాలో కనిపించేదంతా నిజం కాదని మనం గ్రహించాలని, ఆ ప్రచారాన్ని దీటుగా తిప్పికొట్టాలని వైసీపీ శ్రేణులకు సజ్జల పిలుపునిచ్చారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మీడియా, సోషల్ మీడియాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రజలకు ఇంకా చేరువ కావడంపై దృష్టి పెట్టాలనిసూచించారు. పార్టీలో కొత్తగా పదవులు స్వీకరించిన వారు, బాధ్యతలు చేపట్టిన వారు తమ ప్రాంతాల్లో ప్రత్యర్థి పార్టీల ముందు, వివిధ శక్తుల ముందు తమ వాదనను సమర్థంగా వినిపించాలని అన్నారు. అందుకోసం అవసరమైన ప్రోత్సాహాన్ని, సమాచారాన్ని, విధానాలను అందించేందుకు నేటి మీడియా కమ్యూనికేషన్స్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని సజ్జల వివరించారు.

అమరావతి నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేస్తాం: మంత్రి నారాయణ

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాజధాని అమరాతి నిర్మాణం పునఃప్రారంభమయింది. రాజధాని నిర్మాణం పనులను పరుగులు పెట్టించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. తాజాగా మంత్రి నారాయణ మాట్లాడుతూ... మూడేళ్లలో అమరావతి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. న్యాయపరమైన ఇబ్బందుల కారణంగా పనుల ప్రారంభం ఆలస్యమయిందని తెలిపారు. మంత్రి నారాయణ ఈరోజు రాజధాని ప్రాంతంలో పర్యటించారు. నేలపాడు సమీపంలోని అడ్మినిస్ట్రేటివ్ టవర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ఇప్పటి వరకు 40 పనులకు టెండర్లను పిలిచామని నారాయణ తెలిపారు. అమరావతిని ప్రపంచ టాప్ 5 నగరాల్లో ఒకటిగా చేయాలనే లక్ష్యంతో ఐకానిక్ భవనాల నిర్మాణానికి నార్మన్ ఫోస్టర్ చేత డిజైన్ చేయించామని వెల్లడించారు. 2019కి ముందే టీడీపీ హయాంలో జడ్జ్ లు, అధికారులు, ఉద్యోగుల కోసం మొత్తం 4,053 ఫ్లాట్ లతో అపార్ట్ మెంట్ల పనులు ప్రారంభించామని తెలిపారు. అసెంబ్లీని 250 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తామని... సమావేశాలు లేని రోజుల్లో దాన్ని టూరిజం స్పాట్ గా మార్చేలా డిజైన్లు రూపొందించామని చెప్పారు. తాగునీటి పైపులు, విద్యుత్ లైన్లు, డ్రైనేజీలు అండర్ గ్రౌండ్ లో ఉండేలా చేస్తున్నామని తెలిపారు.

హ్యుండాయ్ షోరూమ్‌లో క్రెటా ఈవీ కార్ ఆవిష్కరణ

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాజధాని ప్రాంతంలోని విజయవాడ నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. నగరానికి ప్రజల సౌకర్యార్థం కొత్త వాహనాలు అందుబాటులోకి రావటం ఎంతో సంతోషంగా వుందని ఎంపి కేశినేని శివనాథ్ అన్నారు. ఎనికేపాడు లోని లక్కీ హ్యుండాయ్ షోరూమ్‌లో బుధవారం ఎంపి కేశినేని శివనాథ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎమ్.డి.అహ్మద్ షరీఫ్, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా తో కలిసి హ్యుండాయ్ క్రేటా ఎలక్ట్రిక్ కార్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీ కేశినేని శివనాథ్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ప్రపంచం మొత్తం ఈవీ వాహనాల వైపు చూస్తుందని... ఈవీ వాహనాల వాడకం పెరిగితే కాలుష్యం తగ్గుతుందన్నారు. అలాగే వినియోగదారులకు నిర్వహణ భారం కూడా తగ్గుతుందన్నారు. విజయవాడ గ్రీన్ ఎనర్జీ సిస్టమ్స్‌తో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హ్యుండాయ్ షోరూమ్ చైర్మన్ సందీప్ ఉస్మాన్, సి.జి.ఎమ్. రోహిణ్‌కుమార్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వార్తలు

తెలంగాణకు తీరప్రాంతం లేని లోటును పూడ్చుతాం... మచిలీపట్నం పోర్టుతో అనుసంధానం చేస్తాం: రేవంత్ రెడ్డి

తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : తెలంగాణకు తీరప్రాంతం లేని లోటును పూడ్చేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం పోర్టుకు ప్రత్యేక రోడ్డు, రైలు మార్గాలతో అనుసంధానం చేయనున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణలో డ్రైపోర్టును నిర్మించి వేర్ హౌస్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ డ్రైపోర్టును సమీపంలోని మచిలీపట్నం పోర్టుకు అనుసంధానం చేస్తామన్నారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక ఫోరమ్, సీఐఐ, హీరో మోటో కార్ప్ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రపంచస్థాయి అత్యున్నత ప్రమాణాలతో హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి అందరూ సహకరించాలని కోరారు. హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, అత్యంత వేగవంతమైన, పర్యావరణ అనుకూల నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి రావాలన్నారు. తెలంగాణలోని నాలుగు కోట్ల మంది ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు సహకరించాలని కోరారు. ప్రజలు తక్కువ ఖర్చుతో వేగంగా ప్రయాణించాలనేది ప్రభుత్వ ఆకాంక్ష అన్నారు. పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచంలోనే అత్యుత్తమ మొబిలిటీ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వాహనాలను ప్రోత్సహించేందుకు రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఛార్జీలను రద్దు చేశామన్నారు. దేశంలో అత్యధిక ఎలక్ట్రానిక్ వాహనాల విక్రయాలు తెలంగాణలోనే జరుగుతున్నట్లు చెప్పారు. పర్యావరణ అనుకూల వాహనాల కోసం జీహెచ్ఎంసీలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులను తీసుకువస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో కోటికి పైగా జనాభా ఉందని, 100 కిలోమీటర్ల మేర మెట్రో లైన్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు.

మోదీ ఫొటో లేకుంటే ఉచిత బియ్యం ఎందుకివ్వాలి?: బండి సంజయ్

తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : కొత్త రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్రమోదీ ఫొటో లేకుంటే ఉచిత బియ్యం ఎందుకు ఇవ్వాలని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ప్రధాని ఫొటో పెట్టకపోతే పేదలకు కేంద్రమే నేరుగా ఉచిత బియ్యం అందించే అంశంపై ఆలోచన చేస్తామన్నారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ... పీఎం ఆవాస్ యోజన పేరుతో కేంద్రం మంజూరు చేసిన ఇళ్లకు ఇందిరమ్మ పేరు పెడతామంటే ఒక్క ఇల్లు కూడా మంజూరు చేసే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా కరీంనగర్ కార్పొరేషన్‌ను బీజేపీ సొంతం చేసుకుంటుందన్నారు. కేంద్రం నుంచి నిధులు తెచ్చినా గత పదేళ్లలో ఏనాడూ బీఆర్ఎస్ నేతలు తనను పిలవలేదన్నారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టుకు తాను నిధులు తీసుకువస్తే... బీఆర్ఎస్ వాళ్లు పనులు ప్రారంభించారని విమర్శించారు. కరీంనగర్ కోసం తాను ఎంత కష్టపడినప్పటికీ ఏనాడూ ప్రభుత్వ కార్యక్రమాలకు పిలవలేదని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం అందించిన నిధులతోనే కరీంనగర్ అభివృద్ధి జరిగిందన్నారు. ఈ విషయం ప్రజలకు కూడా అర్థమైందన్నారు. బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలకు అంతులేకుండా పోయిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా మాజీ సీఎం కేసీఆర్ అడుగుజాడల్లోనే నడుస్తున్నారని ఎద్దేవా చేశారు.

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణ చెప్పాలి: కవిత డిమాండ్

తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త :మహిళా కలెక్టర్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అవమానించారని, ఇందుకు మంత్రితో పాటు కాంగ్రెస్ పార్టీ మహిళా నేతలు తక్షణమే కలెక్టర్‌కు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. నిన్న కరీంనగర్ జిల్లా పర్యటనలో మహిళా కలెక్టర్ పమేలా సత్పతిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ మీద మంత్రి చేసిన వ్యాఖ్యకు సంబంధించిన వీడియోను పోస్ట్ చేసిన కవిత... తీవ్రంగా స్పందించారు.ఇది కాంగ్రెస్ నాయకుల అహంకారానికి పరాకాష్ఠ అని మండిపడ్డారు. ఇలాంటి సిగ్గుమాలిన వైఖరి ఆమోదయోగ్యం కాదన్నారు. ఇది కేవలం కలెక్టర్‌ను అవమానించడమే కాదని.. మొత్తం అధికార యంత్రాంగాన్నే అవమానించడమన్నారు. మహిళా కలెక్టర్‌కు తాము అండగా ఉంటామని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మహిళా కలెక్టర్‌కు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఏపీ చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టుపై స్పందించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి

తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త :ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టు అంశంపై తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. ఈ ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం అప్రమత్తంగా ఉందన్నారు. బనకచర్ల విషయంలో తమ ప్రభుత్వంపై హరీశ్ రావు చేసిన ఆరోపణలు సరికాదన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉత్తమ్ కుమార్ మాట్లాడుతూ... బీఆర్ఎస్ హయాంలో నదీ జలాల విషయంలో చాలా నష్టం జరిగిందన్నారు.తాము అధికారంలోకి వచ్చాక నష్టం తగ్గించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చాలా పొరపాట్లు చేసిందని, వాటిని తాము సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఏపీ నిర్మిస్తున్న బనకచర్లపై అభ్యంతరాలు తెలుపుతూ ఇప్పటికే కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశామన్నారు. ఏపీ పునర్విభజన చట్టానికి ఇది విరుద్ధమని, ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించవద్దని కేంద్రాన్ని కోరామన్నారు.

ఎన్టీఆర్ రాజకీయాల్లో పెనుమార్పులు తెచ్చారు: కిషన్ రెడ్డి

తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త స్వర్గీయ నందమూరి తారక రామారావు రాష్ట్రంలో రాజకీయాల్లో పెనుమార్పులు తీసుకువచ్చారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకు వచ్చి, చివరి వ్యక్తికి కూడా ఈ పథకాలు అందేలా చూశాడని కొనియాడారు. బీహార్ మొదటి కాంగ్రెస్సేతర సీఎం కర్పూరీ ఠాకూర్ కూడా ప్రజలకు అద్భుతమైన పాలన అందించారని ప్రశంసించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల అభ్యున్నతికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. కర్పూరీ ఠాకూర్ విద్యార్థి దశ నుంచే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని పేర్కొన్నారు. మాతృభాషను పరిరక్షించుకునేలా హిందీ భాష ప్రోత్సాహానికి విశేష కృషి చేశారన్నారు. 70వ దశకంలో దేశంలో ఇందిరా గాంధీ పాలనకు వ్యతిరేకంగా జనతా పార్టీ ద్వారా నిశ్శబ్ద విప్లవం వచ్చిందన్నారు. ఆ ఉద్యమంలో కర్పూరీ ఠాకూర్‌ది కీలక పాత్ర అన్నారు. బీహార్‌లో మద్యపాన నిషేధం తీసుకువచ్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే నెహ్రూ కుటుంబం అన్నట్లుగా తయారైందని, భారతరత్న వంటి అత్యున్నత పురస్కారాలు కూడా ఆ కుటుంబానికే ఇచ్చుకున్నారని విమర్శించారు. దేశంలో నెహ్రూ కుటుంబం తప్ప మరెవరూ పాలన చేయకూడదని భావించారని, ఆ ఉద్దేశంతోనే అంబేద్కర్‌ను ఎన్నికల్లో ఓడించారని ఆరోపించారు. అంబేద్కర్ ఆలోచనలకు విరుద్ధంగా, రాజ్యాంగానికి విరుద్ధంగా కాంగ్రెస్ పాలన చేసిందని విమర్శించారు.

ప్రజా సంబంధాల కార్యక్రమాల్లో ఉత్తమ సేవకులుగా టైపిస్ట్ కె.భవాని, రికార్డ్ అసిస్టెంట్ జి. శ్రీనివాసరావుకు గౌరవం

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆదివారం స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ డా. జి. లక్ష్మీశ నుంచి సమాచార, పౌర సంబంధాల శాఖకు చెందిన టైపిస్ట్ కె.భవాని, రికార్డ్ అసిస్టెంట్ జి. శ్రీనివాసరావు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా సమాచార శాఖ ద్వారా చేపట్టే ప్రజా సంబంధాల కార్యక్రమాల్లో ఉత్తమ సేవలకు గాను ఉద్యోగులకు ఈ గౌరవం లభించింది..

విధుల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన సమాచార పౌర సంబంధాల శాఖ

గుంటూరు, నేటి పత్రిక ప్రజావార్త :స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో జరిగిన 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా విధుల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు అబ్దుల్ రఫీక్ , డివిజనల్ పౌర సంబంధాల అధికారి జే. శ్యామ్ కుమార్, టైపిస్ట్ సిహెచ్. శివరామకృష్ణ లకు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు.

హైదరాబాదులో కిడ్నీ రాకెట్ కలకలం... తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఫైర్

హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త : హైదరాబాద్ సరూర్‌నగర్ డివిజన్‌లోని అలకనంద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో జరుగుతున్న కిడ్నీ రాకెట్ వ్యవహారాన్ని పోలీసులు బట్టబయలు చేసిన విషయం తెలిసిందే. కిడ్నీ దాతలతో పాటు ఇద్దరు రోగులను పోలీసులు సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ అక్రమ కిడ్నీ మార్పిడి రాకెట్ వ్యవహారంపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధ్యులైన వైద్యులపై చర్యలు తీసుకునేందుకు సమాయత్తం అయింది. ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించి విచారణ చేయనున్నట్లు మెడికల్ కౌన్సిల్ ప్రకటించింది. అనధికారికంగా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు చేసిన అలకనంద ఆసుపత్రి వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టీజీఎంసీ) చైర్మన్ డాక్టర్ మహేశ్ కుమార్ ఫైర్ అయ్యారు. మెడికల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ స్పందిస్తూ .. తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కి న్యాయస్థానాన్ని పోలి ఉండే అధికారాలు ఉన్నాయన్నారు. అక్రమ కిడ్నీ మార్పిడి కుంభకోణంలో ఉన్న వైద్యులపై ప్రభుత్వ, పోలీస్ సహకారంతో ఎథికల్, మాల్ ప్రాక్టీసెస్ కమిటీ ఆధ్వర్యంలో విచారణ జరుపుతామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేశ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతి లేకుండా కిడ్నీ మార్పిడి చేయడం, లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, నకిలీ వైద్యులను ప్రోత్సహించడం చట్ట విరుద్ధమైన చర్యలన్నారు. అందుకు బాధ్యులు అయిన వైద్యులను అవసరం అయితే శాశ్వతంగా మెడికల్ కౌన్సిల్ నుంచి తొలగిస్తామని తెలిపారు.

ఆర్టీసీ డిపోల ప్రైవేటీకరణ ప్రచారంపై స్పందించిన టీజీఎస్ఆర్టీసీ

తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త :తెలంగాణలో ఆర్టీసీ డిపోలను ప్రైవేటీకరణ చేస్తారంటూ ప్రచారం సాగుతోందని, ఇందులో ఎలాంటి వాస్తవం లేదని టీజీఎస్ఆర్టీసీ స్పష్టం చేసింది. డిపోల ప్రైవేటీకరణ దుష్ప్రచారాన్ని ఖండించింది. రాష్ట్రంలోని డిపోల కార్యకలాపాలు అన్నీ ఆర్టీసీ అధీనంలోనే ఉంటాయని వెల్లడించింది. ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు పేరిట ఆర్టీసీ డిపోలను ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో టీజీఎస్ఆర్టీసీ స్పందించింది. ఎలక్ట్రికల్ బస్సుల మెయింటెనెన్స్, ఛార్జింగ్ మాత్రమే ఆయా బస్సుల కంపెనీలు నిర్వహిస్తాయన్నారు. మిగిలిన అన్ని కార్యకలాపాలు ఆర్టీసీ ఆధ్వర్యంలోనే జరుగుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు కాలుష్యాన్ని తగ్గించేందుకు ఈవీ పాలసీని అనుసరించి ఎలక్ట్రిక్ బస్సులను తీసుకువస్తామన్నారు.

గతంలో ఫామ్ హౌస్ లో లబ్ధిదారులను ఎంపిక చేశారు: సీతక్క

తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : రాష్ట్ర వ్యాప్తంగా నిన్న 3,410 గ్రామాల్లో గ్రామసభలు జరిగాయని మంత్రి సీతక్క తెలిపారు. 96 శాతం గ్రామాల్లో ప్రశాం

శ్రీ వేద చారిటబుల్ సేవా ట్రస్ట్ ఉచిత మెగా మెడికల్ క్యాంప్

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : శ్రీ వేద చారిటబుల్ సేవా ట్రస్ట్, వేద హాస్పిటల్ చైర్మన్ డాక్టర్.వై.శేష సాయి ఆధ్వర్యంలో ఆదివారం సత్యనారాయణ పురం శివాలయం దగ్గర శ్రీ సీతారామ కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా మెడికల్ క్యాంప్ విజయవాడ సెంట్రల్ ఎం ఎల్ ఎల్ బోండా ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ ఈరోజు పేద ప్రజల కోసం వేదా హాస్పటల్ వారు ఆర్థోపెడియన్ వెన్ను సంబంధిత, దంత పరీక్షలు మరియు ఆయుర్వేద వైద్యంతో పాటు చిన్న పిల్లల వైద్య నిపుణులతో పరీక్షలు అన్నీ నిర్వహించి ఉచితంగా మందులు అందించడం చాలా సంతోషమన్నారు. ముఖ్యఅతిథిగా నందివెలుగు కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ చైర్మన్ తోట లక్ష్మికోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరంలో అనుభవజ్ఞులైన కీళ్ల, ఎముకల వైద్య నిపుణులు, వెన్ను సంబంధిత వైద్య నిపుణులు, చిన్నపిల్లల వైద్య నిపుణులు, జనరల్ మెడిసిన్, ఆయుర్వేద వైద్య నిపుణులు పాల్గొన్నారని నిర్వాహకులు వేద హాస్పిటల్ చైర్మన్ డా.శేష సాయి తెలిపారు.

ఈ సందర్భంగా డాక్టర్ శేష సాయి మీడియాతో మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా ప్రజా సేవలో అనేక సేవా కార్యక్రమాలు,వైద్య శిబిరాలు ఉచిత మందుల పంపిణీలు చేసామని, షుగర్, బిపి, ఈ.సీ.జీ, బిఎండి(వైబ్రో చెక్) టెస్టులు ఉచితంగా చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించడం జరిగిందని, ఇంకా మెరుగైన టెస్టులు అవసరమైన వారికి ఇతర టెస్టులు కూడా ఉచితంగా చేస్తామని, ఐదు వందల మంది ప్రజలు ఈ శిబిరంలో వైద్య సేవలను వినియోగించుకున్నారన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే బోండా ఉమా కి, 33 డివిజన్ టిడిపి ఇంచార్జ్ గార్లపాటి విజయ్ కుమార్ కి మా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

టిడిపి బ్రాహ్మణ సాధికారిక రాష్ట్ర సభ్యులు, 33 డివిజన్ టిడిపి ఇంచార్జ్ గార్లపాటి విజయ్ కుమార్ మాట్లాడుతూ వేద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఈ ఉచిత మెగా మెడికల్ క్యాంపు సత్యనారాయణపురంలోని 33వ డివిజన్లో ప్రజలకి నిష్ణాతులైన వైద్యులచే వివిధ రకాల జబ్బులు కి ఉచితంగా టెస్టులు

చేయడం మందులు అందించడం లాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వేద హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ వేద చారిటబుల్ సేవా ట్రస్ట్ చైర్‌పర్సన్ యడ్ల పాటి శిరీష రాణి, వేద హాస్పిటల్ చైర్మన్ డా: వై శేషసాయికి అభినందనలు తెలియ జేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డా. బి.వి గురునాథ శర్మ రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ ట్రామా అండ్ ఆర్థోపెడిక్ సర్జన్, డాక్టర్ జె.ఆర్.ఎస్. గౌతమ్, వెన్నుముక సంబంధిత వ్యాధి వైద్య నిపుణులు, డా. ఎన్. చైతన్య కృష్ణ జనరల్ మెడిసిన్, డా.బి.మేఘన చిన్నపిల్లలు మరియు నవజాత శిశువుల వైద్య నిపుణులు, డా. విట్టం శెట్టి శశాంక్ డయాబెటాలజీ & మెటబాలిక్ డిజార్డర్స్, డా.ఆర్. పవన్ కుమార్ ముక్కు గొంతు వైద్య నిపుణులు, డా. కూరపాటి అశోక్ వర్ధన్ ప్రోస్టోడెంటిస్ట్, డా, సింధు బొమ్మిడి పంచకర్మ స్పెషలిస్ట్,డా, పి జగదీష్ దీర్ఘకాలిక వైద్య నిపుణులు, వేద హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ వేద చారిటబుల్ సేవా ట్రస్ట్ చైర్ పర్సన్ యడ్లపాటి శిరీష రాణి,హోవేద హాస్పిటల్స్ చైర్మన్ డా:శేష సాయి, హాస్పటల్ సిబ్బంది ఈ శిబిరంలో వైద్య సేవలు అందించారు.

విధుల్లో ఉత్తమ ప్రతిభ కనపరచిన ఆడియో విజువల్ సూపర్వైజర్ వేమూరి వెంకటేశ్వర ప్రసాద్

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆదివారం స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ డా. జి. లక్ష్మీశ నుంచి సమాచార, పౌర సంబంధాల శాఖకు చెందిన ఆడియో విజువల్ సూపర్వైజర్ వేమూరి వెంకటేశ్వర ప్రసాద్ ప్రశంసా పత్రం అందుకున్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా సమాచార శాఖ ద్వారా చేపట్టే ప్రజా సంబంధాల కార్యక్రమాల్లో ఉత్తమ సేవలకు గాను ఉద్యోగులకు ఈ గౌరవం లభించింది.

నగరంలో రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ నూతన కార్యవర్గ సమావేశం

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : నగరంలో రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఆది వారం విజయవాడ, హనుమాన్ పేట, మారుతి ఫంక్షన్ హాల్లో విశ్వ బ్రాహ్మణ రాష్ట్ర అధ్యక్షులు చేవూరి రామస్వామి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చేవూరు రామస్వామి మాట్లాడుతూ ఈ సమావేశంలో రాష్ట్ర 26 జిల్లాల నుంచి సంఘ ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మా సంఘానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు అదేవిధంగా మా సంఘాన్ని గుర్తించి ఒక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవిని కూడా ఇవ్వాలని ఆయన ఉన్నారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులను అమలు చేయాలని ఆయన తెలిపారు. విశ్వబ్రాహ్మణులు వడ్రంగి కుమ్మరి కంచర, స్వర్ణకార, శిల్పకళాకారు మొదలగువారు ఈ వృత్తిలో ఉన్నారని, వారని కూడా ప్రభుత్వం గుర్తించి రావాల్సిన నిధులను వారికే కేటాయించే విధంగా నిర్ణయించాలని అన్నారు. అంతేకాకుండా అమరావతి రాజధానిలో ఐదు ఎకరాల భూమిని విశ్వబ్రాహ్మణ సంఘానికి కేటా యించాలని కోరారు. బ్రాహ్మణ నాయి బ్రాహ్మణుల మాదిరిగా పలు దేవాలయాల్లో మా కులస్తులకు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన కమిటీ ఎన్నిక జరిగింది. భవిష్యత్ కార్యాచరణ, తీర్మానాలు ఆమోదం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెసి ప్రసాద్, బొందల పాటి ఉ మామహేశ్వ రరావు, కృష్ణాజిల్లా అధ్యక్షులు గొర్తి శ్రీనివాస చక్రవర్తి, రాష్ట్ర కోశాధికారి ఫిరంగి రమణా చార్య తదితరులు పాల్గొన్నారు.

ఆ ఫీల్ రాకపోతే నేను వర్క్ చేయలేను: సమంత

సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ప్రస్తుతం తన జీవితంలో ప్రతి సినిమాను ఇదే చివరిదని భావించే దశలో ఉన్నానని సినీ నటి సమంత అన్నారు. సాధారణంగా ఉండే సినిమాలను ఎన్నో అంగీకరిం చొచ్చని... కానీ, కచ్చితంగా ప్రేక్షకులపై ప్రభావాన్ని చూపే వాటినే ఎంపిక చేసుకుంటున్నానని చెప్పారు. వంద శాతం నమ్మితేనే ఆ పాత్రలను చేస్తానని, లేకపోతే చేయలేనని తెలిపారు.రాజ్ అండ్ డీకే ఎక్కువగా సవాలుగా అనిపించే పాత్రలనే రూపొందిస్తున్నారని... వారితో కలిసి వర్క్ చేయడం తనకు ఎంతో సంతృప్తిగా ఉంటుందని చెప్పారు. నటనకు ఎక్కువ ప్రాధాన్యత ఉండే పాత్రలను వారు రూపొందిస్తున్నారని ప్రశంసించారు. గొప్పగా నటించాను అనే ఫీల్ రాకపోతే తాను వర్క్ చేయలేనని అన్నారు. ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

విధుల్లో ఉత్తమ ప్రతిభ కనపరచిన ఎం.సుహాసిని, డిఎంహెచ్ఓ

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆదివారం స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ డా. జి. లక్ష్మీశ నుంచి వైద్య ఆరోగ్య శాఖ డిఎంహెచ్ఓ ఎం.సుహాసిని ప్రశంసా పత్రం అందుకున్నారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించి, సామాజిక సేవలో భాగస్వాములవుతున్న విశిష్ట మహిళగా ఉత్తమ సేవలకు గాను ఈ గౌరవం లభించింది. ఈ సందర్భంగా ఎం.సుహాసిని, డిఎంహెచ్ఓ మాట్లాడుతూ తనవంతుగా నా ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తున్నానని, ఈ విధంగా ప్రజలకు సేవలు అందిస్తూ తన తోటి వైద్యులు, సిబ్బంది సహకారంతో కొనసాగుతున్న నాకు ఈ పురస్కారం మరింత భాద్యత పెంచిందన్నారు.

ప్రజల మన్నలను పొందుతున్న కూటమి ప్రభుత్వం...

-గార్లపాటి విజయ్ కుమార్

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజల మన్నలను పొందుతున్న కూటమి ప్రభుత్వం అని టిడిపి బ్రాహ్మణ సాధికారిక రాష్ట్ర సభ్యులు, 33 డివిజన్ టిడిపి ఇంచార్జ్ గార్లపాటి విజయ్ కుమార్ అన్నారు. ఆదివారం సత్యనారాయణపురంలోని తమ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రముఖ నటుడు, హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన పద్మభూషణ్ అవార్డుతో గౌరవించింది. ఈ అవార్డు ఆయన కళా రంగంలో చేసిన అద్భుతమైన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో పట్టించుకోకుండా వదిలేసిన రహదారులను మరమ్మత్తులు చేసి పూర్వ వైభవాన్ని తీసుకొస్తున్న కూటమి ప్రభుత్వాన్ని అందరూ కొని ఆడుతున్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పదం వైపు నడిపించడానికి కృషి చేసే దాన్లో భాగంగా అటు కేంద్రం నుండి నిధులు తీసుకురావడానికి కృషి చేస్తూ, ఇటు భావితరాలకు బాటలు వేయడానికి దావోస్ పర్యటన ద్వారా కొత్త కంపెనీలు తీసుకురావడానికి స్వాగతిస్తూ ఉద్యోగాలు కల్పనకు శ్రీకారం చుడుతుంటే ప్రతిపక్షం నోటికి వచ్చినట్లు మాట్లాడటం సబబు కాదన్నారు. ఎవరెన్ని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ బాబు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్నారు అన్నారు.

రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.271కోట్ల నిధులు..

రాజమండ్రి, నేటి పత్రిక ప్రజావార్త : రాజమండ్రి రైల్వే స్టేషన్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.271 కోట్ల నిధులు మంజూరు చేసింది. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో కేంద్రం ఈ నిధులను మంజూరు చేసింది. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని రాజమండ్రి రైల్వే స్టేషన్ అత్యంత ప్రధానమైనది. ఈ స్టేషన్ నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు విశాఖ, కాకినాడ, భీమవరం వైపు రాకపోకలు సాగిస్తుంటారు. ఏడాదికి ఈ స్టేషన్ నుంచి గంటకు 9,533 మంది రాకపోకలు సాగిస్తున్నారన్న అంచనాతో స్టేషన్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయగా, అమృత్ భారత్ స్టేషన్ల అభివృద్ధి కింద కేంద్ర ప్రభుత్వం తొలుత రూ.250 కోట్ల పనులకు టెండర్లు పిలిచింది. అయితే పుష్కరాల ప్రతిపాదనలతో వీటిని రద్దు చేసిన కేంద్రం కొత్త నిధులను మంజూరు చేసింది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రాజమండ్రి రైల్వే స్టేషన్‌ను ప్రపంచ స్థాయి హంగులతో తీర్చిదిద్దాలని గతంలో రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. ఆ క్రమంలోనే అమృత భారత్ స్టేషన్ పథకం కింద రూ.250 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. అయితే పుష్కరాల నేపథ్యంలో తాజా ప్రతిపాదనలతో మరో 21 కోట్లు అదనంగా మంజూరు చేయడం జరిగింది.

దేశ ఉజ్వల భవిష్యత్తు నిర్మాణానికి ఓటు హక్కు వినియోగం ముఖ్యం

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : దేశ ఉజ్వల భవిష్యత్తు నిర్మాణానికి ఓటు హక్కు వినియోగం ఎంతో ముఖ్యమని.. దేశ పౌరునిగా ప్రతి ఎన్నికల్లోనూ నిబద్ధతతో ఓటు హక్కు వినియోగించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అన్నారు. శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో 15 వ జాతీయ ఓటర్ల దినోత్స ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకాగా మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ డా. నిమ్మగడ్డ రమేష్ కుమార్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. జాయింట్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఎ.వెంకటేశ్వరరావు, ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎస్ విజయానంద్ మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ ఏర్పాటైన రోజున ఏటా జనవరి 25 న 2011 నుంచి జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని దేశ వ్యాప్తంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల కీలక భాగస్వామ్యంపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించేందుకు, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది 15 వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నథింగ్ లైక్ ఓటింగ్.. ఐ ఓట్ ఫర్ షూర్.. అనే ఇతివృత్తంతో జరుపుకుంటున్నట్లు వివరించారు. గత ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 81 శాతం ఓటింగ్ నమోదుకు సమిష్టి కృషి కారణమన్నారు. ఇందులో భాగస్వాములైన ప్రతిఒక్కరినీ అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలను అడ్డుకోవడంలో పోలీస్, ఐటీ తదితర శాఖలు చేసిన కృషికి వివిధ గణాంకాలే తార్కాణమన్నారు. అత్యున్నత దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఈసీఐ పాత్ర విశిష్టమైందని సీఎస్ విజయానంద్ అన్నారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలనే ఓటర్ల ఉత్సాహం ఆరోగ్యకర ప్రజాస్వామ్య వ్యవస్థకు కీలకమని, మనం ఓటు వేయడమే కాకుండా ఓటు హక్కు వినియోగించుకునేలా తోటివారిని ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు.

మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ డా. నిమ్మగడ్డ రమేష్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలోనే భారతదేశంలో ఉన్న ప్రజాస్వామ్యం ఉన్నతమైనదని అన్నారు. ఓటు విలువ నాకు తెలుసు కాబట్టే నా స్వంత గ్రామంలో ఓటు హక్కు కోసం పోరాటం చేశానని గుర్తు చేశారు. మన దేశంలో ఓటు హక్కు వినియోగంలో సాంకేతిక పరిజ్ఞానం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు) ఉపయోగించడంలో మనం ముందు ఉన్నామన్నారు. ప్రతి ఒక్కరిలో జవాబుదారీతనం పెరగాలని ఆకాంక్షించారు. అప్పుడే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. ప్రజల్లో ఓటు హక్కుపై చైతన్యం వచ్చిందని, అందుకనే ఎన్నడూ లేని విధంగా ఇటీవల మన రాష్ట్రంలో 81 శాతం ఓటింగ్ వేశారని గుర్తు చేశారు. ఈ చైతన్యం ఇలాగే కొనసాగేలా చూడాల్సిన బాధ్యత వ్యవస్థపై ఉందన్నారు. రాష్ట్ర జాయింట్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఓటర్ల దినోత్సవం జరుపుకుంటున్నామని, ఈ ఏడాది థీమ్ ఓటును మించింది ఏదీలేదు.. నేను ఓటు వేస్తాను అని వివరించారు. ఓటర్లలో చైతన్యం పెంచేందుకు అవగాహన సదస్సులు, యూత్ ఫెస్టివల్స్, వర్క్ షాపులు, డ్రాయింగ్ పోటీలతో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, మరీ ముఖ్యంగా యువతలో ఓటు విలువ పై అవగాహన పెంచే కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు.

సినిమా రంగం నాకు ఇష్టం లేదు: నిత్యా మేనన్

సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : మలయాళ భామ నిత్యా మేనన్ కు దక్షిణాదిలోనే కాదు... బాలీవుడ్ లో కూడా మంచి గుర్తింపు ఉంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో నిత్య మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు సినిమా రంగం అంటేనే ఇష్టం లేదని ఆమె చెప్పారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా జీవితాన్ని అనుభవించాలనేది తన కోరిక అని... ఏదైనా అవకాశం వస్తే మరో రంగంలోకి వెళ్లాలని కూడా ప్రయత్నించానని తెలిపారు. అయితే జాతీయ అవార్డు తన ఆలోచనలను మార్చిందని చెప్పారు. ఉత్తమ నటిగా తాను అందుకున్న పురస్కారం తన సినీ జీవితానికి ఒక మార్గాన్ని చూపించిందని అన్నారు. మరోవైపు తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత బయోపిక్ లో నిత్యా మేనన్ నటించాల్సి ఉంది. నిత్య కథానాయికగా జయలలిత బయోపిక్ చేస్తున్నట్టు 2019లో ప్రియదర్శిని అనే యువ దర్శకురాలు ప్రకటించారు. 'ది ఐరన్ లేడీ' అనే టైటిల్ పోస్టర్ ను కూడా విడుదల చేశారు. ఇది జరిగి ఐదేళ్లు దాటుతున్నా సినిమా మాత్రం పట్టాల పైకి ఎక్కలేదు. జయ బయోపిక్ పై నిత్య మాట్లాడుతూ... బయోపిక్ చేయాలని తాము ఎంతో ఆశపడ్డామని చెప్పారు. అయితే తాము సినిమాను ప్రకటించిన తర్వాత అదే కథతో 'తలైవి' అనే మూవీ వచ్చిందని తెలిపారు. కొంత కాలానికి 'క్వీన్' పేరుతో వెబ్ సిరీస్ వచ్చిందని చెప్పారు. ఈ రెండు విడుదలయ్యాక... తాము సినిమా చేస్తే రిపీట్ చేసినట్టు అవుతుందని... అందుకే ఆ సినిమాను పక్కన పెట్టేశామని తెలిపారు.

కోహ్లీ, రోహిత్ లపై కపిల్ దేవ్ సంచలన వ్యాఖ్యలు

స్పోర్ట్స్ డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : జట్టులో కొనసాగాలంటే నిరంతరం మెరుగుపడుతూనే ఉండాలని, గతంలో సాధించిన రికార్డుల ఆధారంగా ఎక్కువ కాలం జట్టులో కొనసాగలేమని క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ వ్యాఖ్యానించారు. సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను ఉద్దేశిస్తూ తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్న కోహ్లీ, రోహిత్ లు గతంలో ఎన్నో రికార్డులు సాధించి ఉండొచ్చని, అయినా వరుసగా విఫలమవుతుంటే అవకాశమివ్వడంలో అర్థంలేదని స్పష్టం చేశారు. తుది జట్టులో కొనసాగాలంటే ఫామ్ కొనసాగిస్తూ నాణ్యమైన ఆటతీరు ప్రదర్శించాల్సిందేనని వారికి సలహా ఇచ్చారు. తుది జట్టులో చోటుకోసం పోటీ ఎక్కువగా ఉన్న ప్రస్తుత పరిస్థితిలో ఫామ్ లో ఉన్న ఆటగాళ్లనే ఎంపిక చేయాలని కపిల్ దేవ్ అభిప్రాయపడ్డారు. వరుసగా విఫలమవుతున్నప్పటికీ గత కీర్తి ఆధారంగా సీనియర్ ఆటగాళ్లకు జట్టులో చోటు కల్పించడం సరికాదన్నారు. ఒకవేళ కొత్త కుర్రాళ్లు విఫలమైతే తర్వాతి టోర్నమెంట్ కు వారిని పక్కన పెడతారని గుర్తుచేస్తూ సీనియర్లకు మాత్రం ఈ మినహాయింపు దేనికని ప్రశ్నించారు. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ప్రకటించిన జట్టులో కోహ్లీ, రోహిత్ లను ఎంపిక చేయడంపై కపిల్ దేవ్ స్పందిస్తూ.. ఫామ్ లో లేని కోహ్లీ స్థానంలో కుర్రాళ్లకు అవకాశం కల్పించాల్సిందని అభిప్రాయపడ్డారు. కోహ్లీ తన స్థాయికి తగ్గట్లు ఆడాలని, అప్పుడే అతడికి, జట్టుకూ ప్రయోజనమని చెప్పారు.

ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత యానిక్ సిన్నర్... ఫైనల్లో జ్వెరెవ్ ఓటమి

స్పోర్ట్స్ డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : గత కొన్ని రోజులుగా టెన్నిస్ అభిమానులను విశేషంగా అలరించిన ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్ స్లామ్ టోర్నీ ముగిసింది. ఇవాళ మెల్బోర్న్ లో జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో వరల్డ్ నెంబర్ వన్ యానిక్ సిన్నర్ ఘనవిజయం సాధించాడు. ఏకపక్షంగా సాగిన ఈ టైటిల్ పోరులో ఇటలీకి చెందిన సిన్నర్ 6-3, 7-6, 6-3తో వరుస సెట్లలో వరల్డ్ నెంబర్ 2 అలెగ్జాండర్ జ్వెరెవ్ ను ఓడించాడు. సెమీఫైనల్లో లెజెండరీ ప్లేయర్ నొవాక్ జకోవిచ్ గాయంతో వాకోవర్ ఇవ్వడంతో ఫైనల్ చేరిన జర్మనీ ఆటగాడు జ్వెరెవ్... డిఫెండింగ్ చాంపియన్ సిన్నర్ ముందు ఏమాత్రం నిలవలేకపోయాడు. జ్వెరెవ్ రెండో సెట్ లో మాత్రం కాస్తంత పోటీ ఇచ్చినా, టైబ్రేకర్ లో ఆ సెట్ను చేజార్చుకున్నాడు. కాగా, సిన్నర్ కు ఇది వరుసగా రెండో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్. గతేడాది కూడా ఇక్కడ పురుషుల సింగిల్స్ టైటిల్ ను సిన్నరే గెలిచాడు. అంతేకాదు, అమెరికా లెజెండ్ జిమ్ కొరియర్ తర్వాత వరుసగా రెండు పర్యాయాలు ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గిన పిన్న వయస్కుడిగా 23 ఏళ్ల సిన్నర్ ఘనత నమోదు చేశాడు. ఓవరాల్ కు సిన్నర్ కు ఇది మూడో గ్రాండ్ స్లామ్ టైటిల్. గతేడాది యూఎస్ ఓపెన్ లోనూ సిన్నర్ విజేతగా నిలిచాడు.

'సలామ్ సైనికా' సినిమా ట్రైలర్ ను విడుదల చేసిన స్పీకర్ అయ్యన్న పాత్రుడు

అమరావతి,నేటి పత్రిక ప్రజావార్త :దేశ రక్షణ కోసం అహర్నిశం శ్రమిస్తున్న మన దేశ సైనికులు వారి కుటుంబాల సంక్షేమం ఇతివృత్తంగా చిరుగుపాటి క్రియేషన్స్ బ్యానర్ పై చిగురుపాటి సుబ్రమణ్యం దర్శకత్వంలో నిర్మించిన దేశభక్తి పూరిత 'సలామ్ సైనికా' చిత్రం ట్రైలర్ ను ఆదివారం రాష్ట్ర అసెంబ్లీ భవనంలో రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సలామ్ సైనికా చిత్రం దేశం లోపల వెలుపలా శత్రువులతో పోరాడి మరణించే మన సైనికుల విషయంలో ప్రతి భారతీయుడు ఎటువంటి బాధ్యతతో ఉండాలనే ఇతివృత్తంతో కూడినదని చెప్పారు. శత్రువులతో పోరాడే సమయంలో దురదృష్ట వశాత్తు ఎవరైనా సైనికులు చనిపోతే దేశం కోసం వారు చేసిన త్యాగాన్ని దేశ ప్రజలు పూర్తిగా గుర్తించి అలాంటి కుటుంబాలు నిర్లక్ష్యానికి గురి కాకుండా చూడాల్సిన బాధ్యత దేశ పౌరులమైన మనందరిపైనా ఉందనే విషయాన్ని గుర్తు చేసే రీతిలో ఈచిత్ర నిర్మాణం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈసినిమా మొత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే చిత్రీకరించారని దీనిలో 200 మంది వరకూ కొత్త నటీనటులు నటించారని అన్నారు. ఈచిత్రంలో కథానాయకులుగా దేవ్,సాయి మరియు సురేశ్ నంటించగా కథానాయికలుగా శ్రీభవ్య,సోనీ రెడ్డి నటించారని తెలిపారు. నేడు మన రక్షణ వ్యవస్థ ఎంతో పటిష్టంగా ఉండి వారు దేశ సరిహద్దుకు వెలుపల, లోపల అహర్నిశం శ్రమించి కాపాడడంతోనే మనం ఇంత ప్రశాంతంగా జీవనం సాగించ గలుతు తున్నామని అందుకు ప్రతి ఒక్కరూ మన సైనిక వ్యవస్థకు ఎల్లప్పుడూ రుణపడి ఉండాలని సూచించారు. మన దేశ సైకినికులపై రూపొందించిన ఈసలామ్ సైనికా చిత్రాన్ని సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆదరిస్తారని కోరుకుంటున్నట్లు తెలిపారు. సలామ్ సైనికా చిత్ర దర్శకుడు చిగురుపాటి సుబ్రమణ్యం మాట్లాడుతూ భారత సైనికులు అహర్నిశలు దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను ఫణంగా పెట్టి మనలను కాపాడుతున్నారని వారికి మనవంతుగా కలిసి సహాయపడాలనే ఉద్దేశ్యంతో ఈచిత్రాన్ని రూపొందించినట్లు తెలిపారు. సైనికులు చనిపోయినప్పుడు వారి భార్య పిల్లలు అనాధలు అవుతున్నారని వారికి అండగా వుండే బాధ్యత ప్రతీ భారతీయుడు తీసుకోవాలని సలామ్ సైనిక సినిమాలో ఆవిషయాన్నే తెలియ చేశానని అన్నారు. ఈకార్యక్రమంలో ఉప సభాపతి కె.రఘురామ కృష్ణ రాజు,20 సూత్రాల కమిటీ చైర్ పర్శన్ లంకా దినకర్,రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి,అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ఎస్.ప్రసన్న కుమార్,అసెంబ్లీ అధికారులు,సలామ్ సైనికా చిత్ర ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వం గీత వృత్తిదారులకు కేటాయించిన 10% రిజర్వేషన్ మద్యం షాపుల విషయంలో గౌడ కులస్తులకు అన్యాయం!

జై గౌడ సేన వ్యవస్థాపక అధ్యక్షులు మోర్ల ఏడుకొండలు గౌడ్

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ప్రభుత్వం గీత వృత్తిదారులకు కేటాయించిన 10 శాతం రిజర్వేషన్ మద్యం షాపుల విషయంలో గౌడ కులస్తులకు అన్యాయం జరిగిందని జై గౌడ సేన వ్యవస్థాపక అధ్యక్షులు మోర్ల ఏడుకొండలు గౌడ్ అన్నారు. ఆదివారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో మోర్ల ఏడుకొండలు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వం జీవో.ఎంఎస్.నెం. 210,